


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


రాష్ట్రం గర్వించే క్రీడాకారుడిని అవమానించొద్దు: జగన్ కు నారా లోకేశ్ హితవు




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 248 | సోమవారం 14 - 09 -2026 | పేజీలు : 12 | వెల-3




## 'నేతన్న సేవ' కింద ఒక్కో నేతన్నకు రూ.25 వేల ఆర్థిక సాయం

నేతన్న సేవ' కింద ఒక్కో నేతన్నకు రూ.25 వేల ఆర్థిక సాయాన్ని తమ ప్రభుత్వం అందజేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రకటించారు. నంద్యాల జిల్లాలోని బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో మంత్రిని పలుకూరు చేనేత కార్మికులు ఆదివారం కలిశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'నేతన్న సేవలో' కార్యక్రమంపై నేతన్నలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జనార్దన్ రెడ్డికి నేతన్నలు కృతజ్ఞతలు మిగతా2లో

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హైటెక్ భద్రత



**తొలిసారిగా సరికొత్త టెక్నాలజీల వినియోగం**

**శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు**

**కమ్యూనికేషన్ కోసం తొలిసారిగా జియో నెట్‌వర్క్ స్లైసింగ్ టెక్నాలజీ**

**గ్యాలరీల్లో రద్దీని అంచనా వేసేందుకు 200 ఏఐ ఆధారిత కెమెరాలు**

**5,300 మంది సిబ్బంది, 3 వేల కెమెరాలతో నిరంతర నిఘా**

**తోపులాటల నివారణకు దిశల వారీగా ప్రత్యేక ఎగ్జిట్ ప్లాన్ అమలు**

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు టీటీడీ ఈసారి భద్రత విషయంలో సాంకేతికతకు పెద్దపీట వేస్తోంది. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించడం, అత్యవసర సమయాల్లో కమ్యూనికేషన్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా చూడటం లక్ష్యంగా అధునాతన టెక్నాలజీలను ప్రవేశపెడుతోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కెమెరాలు, నెట్‌వర్క్ స్లైసింగ్ వంటి టెక్నాలజీలతో భద్రతా వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తోంది.

**తొలిసారిగా నెట్‌వర్క్ స్లైసింగ్ టెక్నాలజీ**

గరుడ సేవ వంటి ప్రధాన ఘట్టాల సమయంలో మాడ మిగతా2లో



2

# మెగా డీఎస్సీ

## కూటమి ప్రభుత్వంపై జగన్ మరోసారి ఫైర్

- డీఎస్సీ పోస్టింగ్‌లో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ అధినేత జగన్ ఆరోపణలు
- 65 మార్కుల నుంచి 77 మార్కులకు మారిన వైనంపై సందేహాలు
- అర్హత లేని టెట్ పేపర్‌తో ఉద్యోగం ఇచ్చారని విమర్శ
- ఈ స్కాంపై చంద్రబాబు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్



## గోవా గవర్నర్‌తో టీడీపీ నేత చిన్న శ్రీను భేటీ

**కుమార్తె సిరి సహస్రతో కలిసి ఆశీస్సులు అందుకున్న వైనం**

**చంద్రబాబు, లోకేశ్, అశోక్ గజపతి రాజు సూచనలు పాటిస్తానన్న చిన్న శ్రీను**

**వైసీపీ నుంచి ఇటీవల టీడీపీలో చేరిన బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు**

గోవాలోని గవర్నర్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో అశోక్ గజపతిరాజు.. చిన్న శ్రీనుకు, ఆయన కుమార్తెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. 2

# పవన్ కల్యాణ్‌కు కేరళ సీఎం స్పెషల్ థ్యాంక్స్



- ఆయుర్వేద చికిత్స కోసం కేరళను ఎంచుకున్న పవన్ కల్యాణ్
- పవన్‌కు ధన్యవాదాలు తెలిపిన కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్
- కేరళ ప్రజల ఆదరణ, ఆలయాల దర్శనంపై పవన్ ప్రశంసలు
- భుజం గాయానికి శస్త్రచికిత్స అనంతరం పవన్ కేరళ పర్యటన
- సోషల్ మీడియా వేదికగా ఇరువురు నేతల మధ్య ఆసక్తికర సంభాషణ

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఆయుర్వేద చికిత్స కోసం పవన్ తమ రాష్ట్రాన్ని ఎంచుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పవన్ త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ఇద్దరు కీలక నేతల మధ్య మిగతా2లో



# ముగిసిన 18వ బ్రిక్స్ సదస్సు

**ప్రపంచ నేతలకు ధన్యవాదాలు తెలిపిన ప్రధాని మోదీ**

- న్యూఢిల్లీలో విజయవంతంగా 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- సహకారంతోనే సవాళ్లను ఎదుర్కోవాలని సభ్య దేశాలకు ప్రధాని మోదీ పిలుపు
- తదుపరి బ్రిక్స్ సదస్సుకు చైనా ఆతిథ్యం ఇవ్వనున్నట్లు ప్రకటన
- భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేసే న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు కూటమి ఆమోదం

న్యూఢిల్లీ వేదికగా జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు విజయవంతంగా ముగిసింది. ముగింపు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. సదస్సుకు హాజరైన సభ్య దేశాల అధినేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తదుపరి బ్రిక్స్ సదస్సుకు చైనా ఆతిథ్యం ఇవ్వనుండటంతో, ఆ దేశానికి ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించి, సమ్మిళిత అభివృద్ధిని మిగతా2లో



-మంత్రి సత్యకుమార్ యాదవ్

## అంటు వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- రాష్ట్రంలో 1,475 డెంగీ కేసులు నమోదు
- ప్రతి శుక్రవారం 'డ్రై డే'

అంటువ్యాధుల నియంత్రణకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం అమరావతిలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కేసులు పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మలేరియా ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో మందు పిచికారీ చేయాలని మిగతా2లో

# ఇండోనేషియాలో ఘోర నౌకా ప్రమాదం

**జావా సముద్రంలో మునిగిన ఇండోనేషియా ప్యాసింజర్ నౌక**

**ప్రమాదంలో 130 మంది గల్లంతు, 6గురు మృతి**

**107 మందిని సురక్షితంగా కాపాడిన సహాయక బృందాలు**

**భారీ అలల కారణంగానే నౌక బోల్తా పడిందని వెల్లడి**

**గల్లంతైన వారి బంధువుల ఆందోళనతో పోర్టు వద్ద ఉద్రిక్తత**




ఇండోనేషియాలో ఘోర నౌకా ప్రమాదం జరిగింది. 213 మంది ప్రయాణికులు, 30 మంది సిబ్బందితో కలిపి మొత్తం 243 మందితో ప్రయాణిస్తున్న 'వర్గో ట్రాన్స్‌పోర్ట్ 8' అనే నౌక జావా సముద్రంలో 2లో

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హైటెక్ భద్రత..

గరుడ సేవ వంటి ప్రధాన ఘట్టాల సమయంలో మాడ వీధులకు సుమారు 3.5 లక్షల మంది భక్తులు వస్తారని టీటీడీ అంచనా వేస్తోంది. ఇంత భారీ రద్దీ ఉన్నప్పుడు సాధారణ మొబైల్ నెట్‌వర్క్‌లు పనిచేయకపోవడం, వాకీటాకీల ఫ్రీక్వెన్సీలు ఓవర్‌ల్యాప్ కావడం వంటి సమస్యలు తలెత్తుతాయి. దీనిని అధిగమించేందుకు జియోతో కలిసి ప్రయోగాత్మకంగా 'నెట్‌వర్క్ వితిన్ ది నెట్‌వర్క్' పేరుతో నెట్‌వర్క్ స్లైసింగ్ టెక్నాలజీని అమలు చేస్తోంది. దీని కింద 30 అధునాతన కమ్యూనికేషన్ పరికరాలను ఏర్పాటు చేశారు. సాధారణ సిగ్నల్స్ జామ్ అయినా, ఈ పరికరాలు కమాండ్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానమై పనిచేస్తాయి. 11 కీలక సబ్-కంట్రోల్ పాయింట్ల వద్ద ఉన్నతాధికారులకు వీటిని అందించనున్నారు.

**రద్దీని అంచనా వేయనున్న ఏఐ కెమెరాలు**

గ్యాలరీల్లో భక్తుల రద్దీని కచ్చితంగా అంచనా వేసేందుకు ఈసారి తొలిసారిగా ఏఐ, సాఫ్ట్‌వేర్ ఆధారిత హెడ్ కౌంటింగ్ కెమెరాలను వినియోగిస్తున్నారు. గ్యాలరీలను గ్రిడ్లుగా విభజించి, ప్రతి గ్రిడ్‌లో ఉన్న భక్తుల సంఖ్యను ఈ కెమెరాలు రియల్ టైంలో లెక్కిస్తాయి. ఏదైనా గ్యాలరీ సామర్థ్యానికి మించి నిండిపోతే, వెంటనే అప్రమత్తమై భక్తులను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించేందుకు ఇది దోహదపడుతుంది.

**తోపులాటల నివారణకు కొత్త ఎగ్జిట్ ప్లాన్**

గ్యాలరీల నుంచి భక్తులు ఒకేసారి బయటకు వచ్చే సమయంలో తోపులాటలు జరగకుండా ఈసారి దిశల వారీగా కొత్త ఎగ్జిట్ ప్లాన్‌ను అమలు చేస్తున్నారు. ఏ మాడ వీధిలో ఉన్న భక్తులు అదే దిశలో బయటకు వెళ్లేలా మార్గాలను నిర్దేశించారు. దక్షిణ మాడ వీధిలోని భక్తుల కోసం ఎస్-3 గేట్ వద్ద ప్రత్యేక ర్యాంప్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి వారు నేరుగా ఆర్టీసీ బస్సుల్లో తిరుపతి లేదా తిరుమల బస్టాండ్‌కు చేరుకోవచ్చు. మొత్తం మీద సుమారు 3,000 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. అలిపిరి టోల్‌గేట్, నడక మార్గాల వద్ద ఫేషియల్ రికగ్నిషన్, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను అమర్చారు. విజిలెన్స్, పోలీసు సిబ్బంది కలిపి 5,300 మందితో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నారు. తిరుమలలో 4,600 వాహనాలకు మాత్రమే పార్కింగ్ సౌకర్యం ఉండటంతో ఆ పరిమితి దాటితే తిరుపతిలోని ఏడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ పార్కింగ్ స్థలాలకు వాహనాలను మళ్లిస్తారు.

## 'నేతన్న సేవ' కింద ఒక్కో నేతన్నకు రూ.25 వేల ఆర్థిక సాయం



కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'నేతన్న సేవలో' కార్యక్రమంపై నేతన్నలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి జనార్ధన్ రెడ్డికి నేతన్నలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. 'నేతన్న సేవ'తో 51,952 మంది నేతన్నలకు లబ్ధిచేకూరుతుందని వెల్లడించారు. 85,678 మంది 50 ఏళ్లు పైబడిన నేతన్నలకు నెలకు రూ.4 వేల 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ అందజేస్తున్నట్లు ప్రకటించారు. 51,952 మంది నేతన్నలకు ఉచిత విద్యుత్‌లో భాగంగా మగ్గానికి 200, మరమగ్గానికి 500 యూనిట్లు ఇస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

## గోవా గవర్నర్ టీడీపీ నేత చిన్న శ్రీను భేటీ

ఇటీవల తెలుగుదేశం పార్టీలో చేరిన మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. గోవాలో జరిగిన ఈ భేటీలో ఆయన కుమార్తె సిరి సహస్ర కూడా ఉన్నారు. గోవాలోని గవర్నర్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో అశోక్ గజపతిరాజు.. చిన్న శ్రీనుకు, ఆయన కుమార్తెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కూడా వారితో పాటు ఉండి, చిన్న శ్రీను కుటుంబానికి ఆతిథ్యం ఇచ్చారు. సమావేశం అనంతరం చిన్న శ్రీను మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ఆదేశాలను, అలాగే అశోక్ గజపతిరాజు వంటి పెద్దల సూచనలను తాను తు.చ. తప్పకుండా పాటిస్తానని స్పష్టం చేశారు. కేవలం ఆయన ఆశీస్సులు, మార్గనిర్దేశం కోసమే ప్రత్యేకంగా కలిసినట్లు వివరించారు. కాగా, వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణకు మేనల్లుడైన చిన్న శ్రీను, ఇటీవల వైసీపీకి రాజీనామా చేసి తన కుమార్తె సిరి సహస్రతో కలిసి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. ఉండవల్లిలో చంద్రబాబు వారికి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లాకు చెందిన సీనియర్ నేత అశోక్ గజపతి రాజుతో చిన్న శ్రీను భేటీకి రాజకీయంగా ప్రాధాన్యం ఏర్పడింది.

## అంటు వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



అంటువ్యాధుల నియంత్రణకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం అమరావతిలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కేసులు పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మలేరియా ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో మందు పిచికారీ చేయాలని, దోమతెరల పంపిణీని ముమ్మరం చేయాలన్నారు.

**ప్రతి శుక్రవారం 'డ్రై డే'**

ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలని మంత్రి సత్యకుమార్ సూచించారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బందితో డ్రై డే అమలు చేయాలన్నారు. కేసులు పెరిగితే అన్ని స్థాయిలకు వెంటనే అలర్టులు వెళ్లే వ్యవస్థ రూపొందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఇక గత నెల 30 నాటికి రాష్ట్రంలో 7,895 మలేరియా కేసులు నమోదయ్యాయని, నిరుటితో పోలిస్తే మలేరియా కేసులు 27.9 శాతం పెరిగాయని వెల్లడించారు. అల్లూరి, పోలవరం, విజయనగరం ప్రాంతాల్లో మలేరియాపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అల్లూరి, పోలవరం, పార్వతీపురం మన్యం, ఏలూరులో రెండో విడత మందు పిచికారీ చేయాలని సూచించారు. ఇక అర్హులకు 5.99 లక్షల దోమతెరల పంపిణీ ప్రారంభించామని చెప్పారు.

**రాష్ట్రంలో 1,475 డెంగీ కేసులు నమోదు**

రాష్ట్రంలో 1,475 డెంగీ కేసులు నమోదయ్యాయని మంత్రి తెలిపారు. కడపలో 48 నుంచి 128కు, చిత్తూరులో 73 నుంచి 112కు డెంగీ కేసులు పెరిగాయని వివరించారు. కర్నూలు, అనకాపల్లిలో కేసులు తగ్గాయని వెల్లడించారు. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో వెంటనే దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అలాగే, రాష్ట్రంలో ఇప్పటివరకు 941 స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయని మంత్రి తెలిపారు. అల్లూరి, పార్వతీపురం మన్యంలో స్క్రబ్ టైఫస్ కేసులు పెరిగాయని, శ్రీకాకుళంలో ఆహారం ద్వారా వచ్చే వ్యాధుల కేసులు 34 నుంచి 408కు పెరిగాయని వివరించారు. శ్రీకాకుళంలో తాగునీరు, ఆహార పరిశుభ్రతపై ప్రత్యేక తనిఖీలు చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆహారం ద్వారా వచ్చే వ్యాధుల కేసులు 930గా నమోదయ్యాయని పేర్కొన్నారు. కర్నూలులో టైఫాయిడ్ కేసుల నేపథ్యంలో తాగునీటి వనరులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు.

# మెగా డీఎస్సీ: కూటమి ప్రభుత్వంపై జగన్ మరోసారి ఫైర్

టీడీపీ ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ స్కాం జరిగిందంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపిస్తుండడం తెలిసిందే. దీనిపై ఆయన సోషల్ మీడియా వేదికగా మరోసారి ధ్వజమెత్తారు. ఓ అభ్యర్థి విషయంలో జరిగింది సరైన, పారదర్శక విధానమేనా? అని ముఖ్యమంత్రి చంద్రబాబును నిలదీశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. జగన్ తన పోస్టులో పేర్కొన్న వివరాల ప్రకారం, ఒక అభ్యర్థికి 65 టెట్ మార్కులతో, ఏడు దశల వెరిఫికేషన్ తర్వాత ఉద్యోగం కేటాయించారు. అయితే, ఆ తర్వాత అదే అభ్యర్థి అనర్హుడని డీఈవో నిర్ధారించారని తెలిపారు. అలాంటప్పుడు ఆ ఏడు దశల వెరిఫికేషన్‌లో ఏం జరిగిందని ప్రశ్నించారు. తనకు ఉద్యోగం ఎలా వచ్చిందో తెలియదని అభ్యర్థే చెప్పిన విషయాన్ని కూడా జగన్ ప్రస్తావించారు. విమర్శలు వెల్లువెత్తిన తర్వాత, ఆ అభ్యర్థికి 2018 టెట్‌లో 77 మార్కులు వచ్చాయని అధికారులు చెప్పడంపై జగన్ సందేహాలు లేవనెత్తారు. ఆ మార్కులు ముందే ఉంటే, డీఈవో ఎందుకు అనర్హుడని ప్రకటించారని ప్రశ్నించారు. అంతేకాకుండా, ఆ 77 మార్కులు ఎస్‌జీటీ పోస్టుకు అవసరమైన పేపర్-I-Aకు బదులుగా, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన పేపర్-II-దీలో వచ్చాయని, అయినా ఎలా అర్హత కల్పించారని నిలదీశారు. 2018 టెట్ స్కోర్‌తోనే ఉద్యోగానికి అర్హత ఉంటే, ఆ అభ్యర్థి 2025లో మళ్లీ టెట్ ఎందుకు రాశారని జగన్ ప్రశ్నించారు. ఇన్ని మలుపుల తర్వాత ఈ నియామక ప్రక్రియను పారదర్శకంగా జరిగిందని చెప్పగలరా? అని అన్నారు. ఇది డీఎస్సీ స్కామ్‌ను ప్రోత్సహించడం కాదా? అని ప్రశ్నిస్తూ, దీనికి చంద్రబాబు నైతిక బాధ్యత వహించాలని జగన్ డిమాండ్ చేశారు.

# పవన్ కల్యాణ్‌కు కేరళ సీఎం స్పెషల్ థ్యాంక్స్..

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ప్రత్యేక ంగా ధన్యవాదాలు తెలిపారు. ఆయుర్వేద చికిత్స కోసం పవన్ తమ రాష్ట్రాన్ని ఎంచుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పవన్ త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. రాజకీయా లకు అతీతంగా ఇద్దరు కీలక నేతల మధ్య జరిగిన ఈ ఆత్మీయ సంభాషణ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పవన్ కల్యాణ్ తన కేరళ పర్యటన అనుభవాలను పంచుకుంటూ చేసిన పోస్టుకు కేరళ సీఎం సతీశన్ బదులిచ్చారు. "పవన్ కల్యాణ్ గారూ, మీ మంచి మాటలకు, అలాగే విశ్రాంతి, కోలుకోవడానికి కేరళను ఎంచుకున్నందుకు ధన్యవాదాలు. మా ప్రజల ఆప్యాయత, మా ప్రాచీన దేవాలయాల దర్శనం మీకు శాంతిని, స్వస్థతను చేకూర్చాయని తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది. త్వరలోనే మిమ్మల్ని మళ్లీ మా రాష్ట్రంలో చూడాలని ఆశిస్తున్నాము. కేరళ ప్రభుత్వం, ప్రజల తరఫున మీరు సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని సతీశన్ తన పోస్టులో పేర్కొన్నారు. అంతకుముందు, పవన్ కల్యాణ్ తన కేరళ పర్యటన గురించి స్పందిస్తూ ఒక పోస్ట్ చేశారు. చికిత్స నిమిత్తం కేరళలో ఉన్న సమయంలో అక్కడి ప్రజల ఆప్యాయత, దయ, ఆతిథ్యం తనను ఎంత గానో ఆకట్టుకున్నాయని తెలిపారు. పర్యటనలో భాగ ంగా త్రిప్రయార్ శ్రీరామ స్వామి, గురువాయూర్ శ్రీకృష్ణ, మామ్మి యూర్ శ్రీ మహాదేవ, చెట్టికుళంగర శ్రీ భగవతి అమ్మ వంటి ప్రముఖ దేవాలయాలను సందర్శిం చుకున్నానని, ఈ దర్శనాలు తనకు భక్తి, శాంతి, ప్రశాంతతను అందించాయని వివరించారు. తన పర్యటనకు సహకరించిన కేరళ సీఎం వీడీ సతీశ న్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి పవన్ ప్రత్యేకంగా కృతజ్ఞ తలు తెలిపారు. గతంలో ముంబైలో కుడి భుజానికి రొటేటర్ కఫ్ సర్జరీ చేయించుకున్న పవన్, దాని తదుపరి చికిత్సలో భాగంగా కేరళలో ఆయు ర్వేద వైద్యం తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన అక్కడి పలు ఆలయాలను సందర్శిస్తూ, చికిత్స తీసుకుంటూ విశ్రాంతిలో ఉన్నా రు. కాంగ్రెస్ పాలిత రాష్ట్ర ముఖ్యమంత్రి, ఎన్డీయే భాగస్వామ్య పక్షానికి చెందిన ఉప ముఖ్యమంత్రి మధ్య ఈ తరహా స్నేహపూర్వక సంభాషణ జరగడం రాజకీయ వర్గాల్లోనూ సానుకూల వాతావరణాన్ని ప్రతిబింబిస్తోంది. పవన్ కల్యాణ్ వంటి ప్రముఖులు ఆయుర్వేద చికిత్స కోసం కేరళను ఎంచుకోవడం, ఆ రాష్ట్ర సంప్రదాయ వైద్య విధానానికి ఒక గుర్తింపుగా అక్కడి వారు భావిస్తున్నారు.

# ముగిసిన 18వ బ్రిక్స్ సదస్సు..

ఆ దేశానికి ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించి, సమ్మిళిత అభివృద్ధిని సాధించడానికి బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర సహకారం అత్యంత కీలకమని నొక్కి చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఘర్షణల వల్ల సామాన్య ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికత, కీలకమైన ఖనిజాలను కొన్ని శక్తులు ఆయుధాలుగా మార్చుకోవడంపై ఆయన తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. బ్రిక్స్ కూటమి మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న తరుణంలో, ప్రపంచం ఈ కూటమి నుంచి కేవలం ఆలోచనలు, వాగ్దానాలు కాకుండా ఉపయోగకరమైన ఫలితాలను ఆశిస్తోందని మోదీ స్పష్టం చేశారు. ఈ సదస్సులో ఆమోదించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్' కూటమి భవిష్యత్ దార్శనికతకు, పరస్పర సహకారానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్-సిసి, ఇథియోపియా ప్రధాని అబీయ్ అహ్మద్ అలీ, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్ బిన్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ వంటి పలువురు దేశాధినేతలు పాల్గొన్నారు. వీరితో పాటు ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, పలు దేశాల ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

# ఇండోనేషియాలో ఘోర నౌకా ప్రమాదం..

ఇండోనేషియాలో ఘోర నౌకా ప్రమాదం జరిగింది. 213 మంది ప్రయాణికులు, 30 మంది సిబ్బందితో కలిపి మొత్తం 243 మందితో ప్రయాణిస్తున్న 'వర్గో ట్రాన్స్‌పోర్ట్ 8' అనే నౌక జావా సముద్రంలో మునిగిపోయింది. ఈ పెను విషాదంలో ఇప్పటివరకు 107 మందిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడగా, ఆరుగురి మృతదేహాలను వెలికితీశాయి. మరో 130 మంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు. వారి కోసం సముద్రంలో గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వివరాల్లోకి వెళితే, తూర్పు జావాలోని సురబయ నుంచి శనివారం బయలుదేరిన ఈ నౌక, దక్షిణ కాలిమంటన్‌లోని బంజర్‌మాసిన్‌కు వెళుతోంది. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కెప్టెన్ నుంచి అధికారులకు చివరి సందేశం అందింది. సముద్రంలో దాదాపు 3 మీటర్ల ఎత్తున అలలు




ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయని, దీంతో నౌక ఒకవైపునకు ఒరిగిపోతోందని ఆయన తెలిపారు. ఆ తర్వాత కొద్దిసేపటికే నౌకతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. బంజర్‌మాసిన్ రేవుకు సుమారు 148 కిలోమీటర్ల దూరంలో ఈ దుర్ఘటన జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. నౌకాదళానికి చెందిన నౌకతో సహా నాలుగు నౌకలు, ఒక హెలికాప్టర్, సమీపంలోని టగ్‌బోట్ల సహాయంతో గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు. కాపాడిన వారిని సమీపంలోని తూర్పు జావా పోర్టుకు తరలిస్తున్నారు. మరోవైపు, బంజర్‌మాసిన్‌లోని త్రిశక్తి పోర్టు వద్ద గల్లంతైన వారి బంధువులు వందలాదిగా గుమిగూడారు. ప్రయాణికుల జాబితాలను చూస్తూ తమ వారి క్షేమ సమాచారం కోసం తీవ్ర ఆవేదనతో ఎదురుచూస్తున్నారు. వేలాది ద్వీపాలతో కూడిన ఇండోనేషియాలో రవాణాకు ఫెర్రీలపైనే ఎక్కువగా ఆధారపడతారు. అయితే, భద్రతా లోపాల కారణంగా ఇక్కడ తరచూ ఇలాంటి సముద్ర ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. అంతేకాకుండా, అధికారిక రికార్డుల్లో ఉన్న ప్రయాణికుల సంఖ్యకు, వాస్తవంగా నౌకలో ఉన్నవారి సంఖ్యకు తేడా ఉండటం ఇక్కడ సర్వసాధారణమని, దీంతో గల్లంతైన వారి కచ్చితమైన సంఖ్యను నిర్ధారించడం కష్టంగా మారిందని అధికారులు పేర్కొంటున్నారు.

# ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం..!





## ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, కడప పర్యావరణ ఇంజనీర్ సుధా కురుబ

**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 13: నంది పత్రిక** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఓపి) విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కడప ప్రాంతీయ కార్యాలయ పర్యావరణ ఇంజనీర్ సుధా కురుబ పిలుపునిచ్చారు.వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, కడప ఆధ్వర్యంలో శనివారం కడప నగరంలోని కోటి రెడ్డి సర్కిల్ సమీపంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ కార్యాలయం, కడప పర్యావరణ ఇంజనీర్ సుధా కురుబ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసి, పర్యావరణహిత వినాయక చవితి వేడుకలపై అవగాహన కల్పించారు. “మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం.”

ఈ సందర్భంగా పర్యావరణ ఇంజనీర్ శ్రీమతి సుధా కురుబా మాట్లాడుతూ, సహజసిద్ధమైన మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించవచ్చని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు మరియు రసాయనిక రంగుల వినియోగం వల్ల నిమజ్జనం అనంతరం జలవనరులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.వినాయక చవితి సందర్భంగా ప్రజలు పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించాలని, రసాయనిక రంగులతో కూడిన విగ్రహాలకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. మట్టి విగ్రహాలను పూజించి, సహజసిద్ధమైన పద్ధతుల్లో నిమజ్జనం చేయడం ద్వారా నీటి వనరులను కాలుష్యం నుంచి కాపాడటంతో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పండుగల సందర్భంగా భక్తి, ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ బాధ్యతను కూడా పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె తెలిపారు. “మన పండుగ మన బాధ్యత, మట్టి వినాయకుడు పర్యావరణానికి మేలు” అనే సందేశంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, కడప సిబ్బంది, స్థానిక ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణదేవరాయలు అందరికీ ఆదర్శప్రాయుడు





## రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఎన్టీఆర్ కాంప్లెక్స్ ఆవరణలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ. ప్రజా సంక్షేమం, సాగునీటి రంగంలో రాయల పాలన స్ఫూర్తిదాయకం

**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 13 ( నంది పత్రిక )** ప్రజా సంక్షేమ పాలనలో విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు . ఆదివారం స్థానిక ఎన్టీఆర్ కాంప్లెక్స్ ఆవరణలో బలిజ సంఘం మరియు కాపు రాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని మంత్రి ఫరూక్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టిన గొప్ప చక్రవర్తి అని కొనియాడారు. ప్రజల సాగునీరు, తాగునీటి అవసరాల కోసం చెరువులు, కుంటలను తవ్వించి చరిత్రలో నిలిచారని గుర్తుచేశారు. శ్రీకృష్ణదేవరాయలు అందరివాడని, ఆయన విగ్రహ ఏర్పాటు విషయంలో ఎలాంటి వివాదాలకు తావులేదని స్పష్టం చేశారు. తిరుమల శ్రీవారికి ఎన్నో అమూల్యమైన వజ్రాభరణాలు, బంగారు నగల సమర్పణతో పాటు చారిత్రాత్మక కట్టడాలెన్నో నిర్మించారని తెలిపారు . మార్కాపురం సమీపంలోని కంబంలో తన భార్య పేరు మీద నిర్మించిన చెరువు నేటికీ దేశంలోనే అత్యంత పెద్ద చెరువుల్లో ఒకటిగా రికార్డు సాధించిందని గుర్తుచేశారు.

**మంత్రి ఫరూక్ చొరవ అభినందనీయం** దశాబ్దాలుగా విగ్రహ ఏర్పాటు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, మంత్రి ఫరూక్ తీసుకున్న ప్రత్యేక చొరవ వల్లే ఈరోజు విగ్రహావిష్కరణ సాధ్యమైందని సంఘ పెద్దలు కొనియాడారు. గతంలో బలిజ సామాజిక వర్గానికి చెందిన పాణ్యం రామయ్యకు మున్సిపల్ చైర్మన్‌గా అవకాశం కల్పించడంతో పాటు శాంతిరాముడు వంటి ప్రముఖులకు అండగా నిలిచారని, భవిష్యత్తులోనూ ఫరూక్ కుటుంబానికి పూర్తి మద్దతు ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. అనంతరం దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.విగ్రహ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన కామిని మల్లికార్జున, చెన్నంశెట్టి శ్రీనివాసులు , కొప్పుల మురళి, చింతల కుమార్, ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ చలం బాబు, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి నాగేశ్వరరావు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు నాగరాజు, సుబ్బయ్య, గోపాల్, పాణ్యం శ్రీకాంత్ తదితరులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది రామచంద్రరావు, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, శాంతిరాం విద్యాసంస్థల అధినేత శాంతిరాముడు, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, పారిశ్రామికవేత్త రాజారాం, వైద్యులు రవికృష్ణ, నారాయణ, ఆర్పీఎఫ్ అధ్యక్షుడు రెడ్డి శేఖర్, ఏపీపీఎస్సీ డైరెక్టర్ శివరాం, అహోబిలం బలిజ అన్నదాన సత్రం అధ్యక్షుడు విజయ్, బలిజ సంఘం మాజీ అధ్యక్షుడు పడకండ్ల సుబ్రహ్మణ్యం, చింతల రామకృష్ణ, అభిమన్యుడు, మల్లయ్య పాల్గొన్నారు.

# జర్నలిస్టుల గళానికి మరింత బలం..



ఏపీ జేపీఎస్‌లో కొత్త కమిటీల కొలువుదీరింపు!లిఅన్నవరంలో జోనల్, జిల్లా కమిటీల నియామకం.. డోన్ నంది పత్రిక సెప్టెంబర్ 13 రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న జర్నలిస్టుల పరిరక్షణ సమితిఅన్నవరం, కాకినాడ జిల్లా:జర్నలిస్టుల హక్కులు, వారి పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల పరిరక్షణ సమితి (ఏపీ జేపీఎస్) తన కార్యకలాపాలను రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా కాకినాడ జిల్లా అన్నవరం నియోజకవర్గ కేంద్రంలో జోనల్, జిల్లా కమిటీల నియామక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై నూతనంగా నియమితులైన జోనల్, జిల్లా కమిటీ బాధ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. అతి తక్కువ కాలంలోనే ఏపీ జేపీఎస్ జర్నలిస్టుల నుంచి విశేష ఆదరణ పొందడం సంస్థ బలానికి నిదర్శనమన్నారు.రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.జర్నలిస్టులపై ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదురైనప్పుడు వారికి అండగా నిలవడంతో పాటు, వారి హక్కుల పరిరక్షణ కోసం ఏపీ జేపీఎస్ నిరంతరం పనిచేస్తుందని స్పష్టం చేశారు. జర్నలిస్టు సమస్యలపై రాజీ లేని పోరాటమే సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటైన కమిటీలు తమ పరిధిలోని పాత్రికేయులను సమన్వయం చేసుకుంటూ, సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. జోనల్ కన్వీనర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాలని కోరారు ఏపీ జెపిఎస్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించి బలోపేతం చేయాలని వారు సూచించారు అనంతరం ఏపీ జేపీస్ లోగ్ ను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఏపీ జేపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శివరామయ్య ఆచారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వి. మూర్తి, ఈశ్వర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి విజయ్, సహకార కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర కోశాధికారి దయాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు రంగన్న గౌడ్, శ్రీనివాసులు, డోన్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి శ్రీనివాస్ తదితరులతో పాటు కాకినాడ జిల్లాకు చెందిన పలువురు పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## తవ్వా రామిరెడ్డికి వైసీపీ నాయకుల ఘన సత్కారం



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 13**వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శిగా పదవి పొందిన తవ్వా రామిరెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తవ్వా రామిరెడ్డికి శాలువా కప్పి, పూలమాల వేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ మండల అధ్యక్షుడు దుగ్గిరెడ్డి మురళి మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవరెడ్డి, కీసీ కెనాల్ ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ డీఎల్ శ్రీనివాసులు రెడ్డి, స్టేట్ ఐటీ వింగ్ సెక్రటరీపాలకోలను లక్ష్మీనారాయణ రెడ్డి, మండల నాయకుడు సిద్ధారెడ్డి, మండల యువత అధ్యక్షుడు ఎం.వి. రమణ పాల్గొన్నారు. అలాగే మాజీ సర్పంచులు భూమన సుబ్బారెడ్డి, బుజ్జి, చిన్న సుబ్బారెడ్డి, వైసీపీ నాయకులు వెంకట సుబ్బారెడ్డి, గురివిరెడ్డి తదితరులు పాల్గొని తవ్వా రామిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆరు ఏళ్ల నిర్బంధంపై కాంగ్రెస్ ఆగ్రహం.. ఆందోళన ఉధృతం చేస్తాం: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డాక్టర్..ఫయాజ్



**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 13**ఖాజీపేట, వైఎస్సార్ కడప జిల్లా: ప్రముఖ ఉద్యమకారులు ఉమర్ ఖాలీద్, షర్జిల్ ఇమామ్‌ల అరెస్టుకు ఆరు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వారికి సంఘీభావం తెలుపుతూ ఖాజీపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ ఫయాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ ఫయాజ్ మాట్లాడుతూ ఉమర్ ఖాలీద్ అరెస్ట్ అక్రమమని ఆరోపించారు. 2020 సెప్టెంబర్ 13న అరెస్టు చేసిన వారిని ఇంతకాలం నిర్బంధంలో ఉంచడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కేసుపై విచారణ జరిపి ఉమర్ ఖాలీద్, షర్జిల్ ఇమామ్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ర్యాలీలో కాంగ్రెస్ యువజన కార్యకర్త గౌస్, కాంగ్రెస్ జిల్లా ఎస్సీ అధ్యక్షుడు రమణ, ఖాజీపేట మాజీ ఎంపిటీసీ కరీమున్నిసా,సామాజిక కార్యకర్తలు సిరాజ్, బిజిలి, ఆరిఫ్, రామారావు, మబ్బాషా, ఆటో ఖాసీం పీరాన్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీకి సంఘీభావం తెలుపుతూ కడప కాంగ్రెస్ నగర అధ్యక్షుడు తన అనుచరులతో కలిసి సుమారు 15 మంది కడప నుంచి వచ్చి పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించే మట్టి వినాయకులనే పూజిద్దాం.. గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి



**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 13 ( నంది పత్రిక )** పర్యావరణాన్ని పరిరక్షించేలా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుని ప్రతిష్టించి పూజించాలని శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి పేర్కొన్నారు. గురు రాజ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో వినాయక చవితిని పురస్కరించుకొని స్కూల్లో మట్టి వినాయకులను పంపిణీ చేశారు. సందర్భంగా షేక్షావలి రెడ్డి మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజిస్తే ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్తో తయారుచేసిన వినాయకులను నిమజ్జనం చేస్తే ఎన్నో రకాల హాని జరిగే అవకాశం ఉందని చెప్పారు. అందువల్ల ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని రక్షించాలని చెప్పారు.

## ఆరోగ్యాంధ్రప్రదేశ్ లో భాగస్వాములు అవ్వండి : కమిషనర్ జయకృష్ణ. ప్రకాశం పార్క్ వాకర్స్‌కు బెస్ట్ క్లబ్ అవార్డు.




**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 13 నంది పత్రిక** ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లో స్థాపనలో ప్రజలందరూ భాగస్వాములై ఆనందకరమైన జీవితం గడపాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ తెలిపారు. తిరుపతి ప్రకాశం పార్క్‌వాకర్స్ అసోసియేషన్‌కు వచ్చిన బెస్ట్ క్లబ్ అవార్డును ఆదివారం కమిషనర్ ఎం.జయకృష్ణ తన చేతుల మీదుగా అందజేశారు. పార్కులో ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వాకర్స్ అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను కమిషనర్ అభినందించారు. ఇలాంటి మంచి కార్యక్రమాలను ఇతర ప్రాంతాల్లోనూ విస్తరించాలని ఆకాంక్షించారు.

**చిన్నచిన్న సమస్యలను సమిష్టి కృషితో పరిష్కరించుకోవాల ని సూచించారు.** వాకింగ్, యోగా వంటి కార్యక్రమాలు ఒత్తిడిని తగ్గించి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ఆరోగ్యవంతమైన, ఆనందకరమైన ఆంధ్రప్రదేశ్‌కు పార్కులు, రిక్రియేషన్ ప్రదేశాలు అవసరమని తెలిపారు. పిల్లలను కూడా ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తే చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన జీవన విధానం అలవడుతుందని చెప్పారు. తాగునీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇస్తూ, వాకర్స్ మరిన్ని సేవలు చేసి మరిన్ని అవార్డులు సాధించాలని కమిషనర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.రమణ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోపినాథ్, వెంకట రెడ్డి, జగన్నాదం, లక్ష్మీపతి,



# చింతరాయిపల్లె వాసి నాగరాజుకు రాష్ట్రస్థాయి ఐకాన్ అవార్డు



**సిరివెళ్ల::** కొలిమిగుండ్ల మండలం చింతరాయపల్లె గ్రామానికి చెందిన పెద్ద సుబ్బరాయుడు రామసుబ్బమ్మ దంపతుల కుమారుడు ఎం. నాగరాజు కు రాష్ట్రస్థాయి ఐకాన్ గ్లోబల్ ఎడ్యుకేషనల్ 2026 వార్షిక ఏడాదికి ఎంపిక కాగా గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నాజీర్ హుస్సేన్, రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ కమిటీ సభ్యులు అనిల్ కుమార్ గుంటూరు మెడికల్ కళాశాలలో ఆదివారం అవార్డును అందించి పూలమాల వేసి, శాలువా, జ్ఞాపికతో సత్కరించ్చారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రతి ఏటా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రయివేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రొఫెసర్లు తమ సబ్జెక్టులో విద్యార్థులు 100 శాతం సాధించిన మార్కుల ఆధారంగా రాష్ట్రస్థాయి ఐకాన్ గ్లోబల్ ఎడ్యుకేషనల్ అవార్డును అందించడం జరుగుతుందన్నారు. చింతరాయిపల్లెకు చెందిన ప్రవేటు పాఠశాల గణిత ఉపాధ్యాయుడు నాగరాజును గత 26 ఏళ్లుగా విద్యాభోధన చేస్తూ విద్యార్థుల ద్వారా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న సందర్భంగా శాలువాతో సత్కరించి జ్ఞాపికను అవార్డును అందించడం జరిగిందన్నారు. అవార్డు గ్రహీతను కొలిమిగుండ్ల మండలం విద్యాశాఖ అధికారులు, ప్రైవేట్ పాఠశాలల ఆసోశేషన్ యూనియన్ నిర్వాహకులు, పలువురు ప్రజా ప్రతినిధులు, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

# విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి..!!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు



**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 13 నంది పత్రిక** : శ్రీ గణనాథుని ఆశీస్సులతో జిల్లా ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, సంప్రదాయం, ఆత్మీయతలతో వినాయక చవితి వేడుకలను ఆనందంగా నిర్వహించుకోవాలని, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పొరుగువారితో కలిసి సోదరభావంతో పండుగ జరుపుకోవాలని కోరారు. పండుగ వేళ ప్రజల భద్రత, ప్రశాంతతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, శబ్ద కాలుష్యానికి దూరంగా ఉంటూ చిన్నారులు, వృద్ధులు, మహిళలు, అనారోగ్యంతో ఉన్నవారి పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ సహజ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను వినియోగించాలని జిల్లా కలెక్టర్ కోరారు. నీటి వనరులు కలుషితం కాకుండా నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలని, పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలను నివారించాలని సూచించారు. మన భక్తి ప్రకృతికి భారం కాకుండా, భవిష్యత్ తరాలకు మేలు చేసేలా ఉత్సవాలను నిర్వహించడమే నిజమైన పండుగ స్ఫూర్తి అన్నారు. గణనాథుని కృపతో జిల్లాలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, రైతుల కుటుంబాల్లో సిరిసంపదలు, ప్రతి ఇంటా ఆరోగ్యం, ఆనందం నెలకొనాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రజల ఐక్యత, భాగస్వామ్యం, బాధ్యతాయుతమైన సహకారంతో వైఎస్ఆర్ కడప జిల్లా అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# ఎల్‌నినో ప్రభావంతో నష్టపోతున్న రైతులను పరామర్శించేందుకు ప్యాపిలిలో రేపు 14వ తేదీ సీపీఐ జాతీయ కార్యదర్శి కే. రామకృష్ణ పర్యటన



**ప్యాపిలి. సెప్టెంబర్ 13 . (నంది పత్రిక )**::ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు నష్టపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను పరామర్శించేందుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కే. రామకృష్ణ ప్యాపిలి మండలంలో కరువు పర్యటన నిర్వహించ నున్నారని సీపీఐ మండల కార్యదర్శి మహేష్ తెలిపారు.ఈ సందర్భంగా కరువు పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి, నష్టపోయిన పంటలను పరిశీలించడంతో పాటు రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోనున్నారు. వర్షాలు సకాలంలో కురవకపోవడం, సాగునీటి కొరత, పెట్టుబడులు పెరగడం, పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు.కరువు ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం తక్షణమే పంట నష్టపరిహారం అందించాలని, పంటల బీమా పరిహారం చెల్లించాలని, రైతుల రుణాలను పునర్వ్యవస్థీకరించి వడ్డీ భారాన్ని తగ్గించాలని సీపీఐ డిమాండ్ చేసింది.రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే సీపీఐ ఆధ్వర్యంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.కే. రామకృష్ణ కరువు పర్యటనకు రైతులు, కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు.

# డోన్ పోలీస్ స్టేషన్లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

**డోన్ నంది పత్రిక సెప్టెంబర్: 13** పట్టణంలోని పోలీస్ స్టేషన్లో ఆదివారం డోన్ పట్టణ సి ఐ ఇంతియాజ్ బాషా ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు.సి ఐ మాట్లాడుతూ సమాజంలో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసే వారిపై ఉక్కు పాదం మోపుతామని భూ సెటిల్మెంట్లు, బెదిరింపులు, అసాంఘిక కార్యకరాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని , రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, చట్టాన్నిఅతిక్రమిస్తే చట్టపరమైన తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. నేర ప్రవృత్తిని వీడి సాధారణ జీవితం గడపాలని, కుటుంబ సభ్యులతో కలిసి సవ్యమైన మార్గంలో నడవాలని ఆయన రౌడీ షీటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు.

### కమిషనర్ జయకృష్ణ.



**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 13 నంది పత్రిక** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ను ఈనెల 14వ తేదీ వినాయక చవితి పండుగ సందర్భంగా రద్దు చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ జయకృష్ణ, ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి పండుగ సోమవారం నిర్వహించడం వలన పి.జి.ఆర్.ఎస్. రద్దు చేశామని కావున ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని తెలిపారు. రానున్న సోమవారం యధావిధిగా డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని తెలిపారు.

# వెలగ పండు మీద 720 సూక్ష్మ వినాయకులు



**నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 13 . (నంది పత్రిక )**:నంద్యాల కు చెందిన ప్రముఖ చిత్రకారుడు కళారత్న చింతలపల్లె కోటేష్ వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని వెలగ పండు (వెలక్కాయ ) చుట్టూ మైక్రో బ్రష్ ద్వారా బ్లాక్ కలర్ తో 720 సూక్ష్మ వినాయకులను వివిధ రూపాలతో 3 గంటల వ్యవధి లో వేసి అబ్బుర పరిచారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగ పూజలో వినాయకునికి సమర్పించే పూలు, పండ్లలో వెలగ పండు అత్యంత ముఖ్యమైనది. గణేశునికి ఈ పండు అంటే చాలా ఇష్టం. అందుకే వెలగ పండు మీద ఈ చిత్రాలు వేసాను. హిందువులకు పెద్ద పండుగ వినాయక చవితి. హిందూ దర్మంలో ప్రధమ పూజలు అందుకునే దేవుడు గణేశుడు. నేను వేసిన ఈ చిత్రంలో గణనాధుడు భక్తులకు అభయమిస్తున్నట్లు, మూషిక వాహనంపై గణేశుడు, త్రిముఖ గణపతి, నాట్య భంగిమలో గణపతి,ఓం ఆకారంలో గణనాధుడు, శంకు ఆకారం గణేశుడు,కాణిపాకం గణపతి ఇలా బొమ్మల్లో బొమ్మలు అనేక గణేశుని బొమ్మలు చిన్న వెలగ పండు మీద వేసాను. స్వామి అనేక నామధేయుడు. గణపతి, గజాననా, గణేశా, విఘ్న శ్వరుడు, లంభోదరుడు, ఏక దంతుడు, మహా కాయ, వక్ర తుండ, బొజ్జ గణపయ్య ఇలా అనేక పేర్లతో స్వామిని పిలుస్తారు. ప్రతి పేరుకు ప్రత్యేక త వుంది. గణపతి అంటే గణాలకు అధిపతి. గజాననా అంటే ఏనుగు ముఖం కలవాడు. విఘ్నేశ్వరుడు అంటే విఘ్నలను తొలగించే వాడు. మహా కాయ అంటే పెద్ద శరీరం కలవాడు ఇలా స్వామిని అనేక పేర్లతో పిలుస్తారు. సకల దేవతలు కూడా స్వామిని పూజిస్తారు. ఏ పూజ చేసిన, ఏ మంచి కార్యక్రమం తలపెట్టిన ముందుగా గణపతినే పూజిస్తారు.స్వామి పై వున్న భక్తి తో ప్రతి సంవత్సరం వినాయక చవితి పండుగ కు గణేశుని పై బొమ్మలు వేస్తూ వుంటాను.ఈసారి స్వామికి ఇష్టమైన వెలగ పండు మీద వేసాను.భక్తులందరికి వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు. అందరికి ఆ స్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను. జై గణేశా.. జై జై గణేశా.

# నేడు (14న) పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు ఉండవు..!

### జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు

**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 13 నంది పత్రిక** వినాయక చవితి పండుగ సందర్భంగా ఈనెల 14న సోమవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో జిల్లా వ్యాప్తంగా పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించబడవని జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్, మండల రెవెన్యూ కార్యాలయాలతో పాటు జిల్లా కలెక్టరేట్‌లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు ఉండవని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి, అర్జీలు సమర్పించేందుకు సోమవారం కలెక్టరేట్‌కు రావద్దని జిల్లా రెవెన్యూ అధికారి సూచించారు.

# ఆలోచనే ఆధారం




**నంది పత్రిక:**ఆలోచన మనిషికి ఉన్నగొప్ప వరం ఆలోచనతోనే మంచి చెడు మధ్య వివక్షపాటిస్తాడు.ప్రగతికి ప్రణాళికలు రచిస్తాడు.ఓ మనిషి నీ ఆలోచనలను మార్చుకో నీప్రపంచం దానంతటదే మారుతుంది ప్రతి చీకటి రాత్రి వెనుకఒక అందమైన ఉదయందాగి ఉన్నట్లే ప్రతి కష్టం వెనుక ఒక గొప్ప అవకాశం ఉంటుంది.ప్రపంచం నిన్ను నమ్మకపోయినా పర్వాలేదు కానీ నిన్ను నువ్వు నమ్మడం ఎప్పటికీ ఆపవద్దు. సమస్యలు నిన్ను కుంగ తీయడానికి రావు నీలో దాగి ఉన్న శక్తిని సామర్థ్యాన్ని పరిచయం చేయడానికి వస్తాయి.మదిలో చీకటి ముసిరిన వేళ ఆశల దీపం వెలిగించి చూడాలి.ఓటమి నిన్ను వెక్కిరించిన వేళ గెలుపుకు సరికొత్త బాటలు వేయాలి.నిరాశల అలలు నిన్ను ముంచినా ధైర్యపు నావుపై ప్రయాణించాలి .ప్రతికూల ఆలోచనల ముళ్ళను తుంచేసి సానుకూల సుగంధాలు వ్యాపింప చేయాలి.ఆలోచన మారితే ఆశయం మారును.ఆశయం మారుతే నీ భవిష్యత్తు మారను నమ్మకమే నీ మొదటి అడుగు కావాలి.అప్పుడు విజయం నీకు బానిస అవుతుంది.ఎగిరే పక్షిని చూసి నేర్చుకో పడినా మళ్ళీ పైకి లేవడం సానుకూల దృక్పదమే నీఆయుధమైతే జగత్తును జయించడం ఎంతో సులభం నెగెటివ్ ఆలోచనలు వద్దు సానుకూల ఆలోచనలే మన విజయాలకు హద్దు.(సెప్టెంబర్13 సానుకూల ఆలోచనా దినోత్సవంసందర్భంగా) (పాజిటివ్ థింకింగ్ డే )నేదునూరి కనకయ్య అధ్యక్షులు తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరంతెలంగాణ ఎకనామిక్ ఫోరం రచయిత కాలమిస్ట్ కరీంనగర్.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఐదు వీల్ చైర్లు పంపిణీ

**నంద్యాల ప్రతినిధి. సెప్టెంబర్ 13 . (నంది పత్రిక ):** రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 25 వేల రూపాయలు విలువచేసే ఐదు వీల్ చైర్లు పంపిణీ చేసినట్లు ప్రెసిడెంట్ సుధా ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం రోటరీ క్లబ్ ద్వారా అహోబిలం దేవస్థానం కు రెండు వీల్ చైర్లు, సంజీవ నగర్ కోదండ రామాలయం కు 1 వీల్ చైర్ మొత్తం మూడు వీల్ చైర్లు మాలేపాటి రాజశేఖర్ సహకారంతోమరియు సిరివెళ్ల గ్రామస్తులకు కండే హరినాథ్ సహకారంతో రెండు వీల్ చైర్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ సుధా ప్రసాద్ రెడ్డి పీడీజీలు కల్లూరు రామలింగారెడ్డి శ్రీరామ్ మూర్తి చిన్నపరెడ్డి స్వామి మాలే పాటి రాజశేఖర్ మరియు కండేహరినాథ్ జయకృష్ణ లక్ష్మీకాంతరెడ్డి సుబ్బరామయ్య కైలాసనాద్ రెడ్డి ఎల్ఐసి వెంకటేశ్వర్లు చంద్రశేఖర్ రెడ్డి వివేకానంద రెడ్డికామిని బాలకృష్ణ యుగంధర్ రెడ్డి సాయి సత్యనారాయణ అనిల్ మరియు అహోబిలం మఠం మేనేజర్ టీ బద్రీ నారాయణ సంజీవనగర్ కోదండ రామాలయం చైర్మన్ సముద్రాల సూరయ్య పాల్గొనడం జరిగింది.



# ఏఈనాగరాజు కు జాతీయస్థాయి పురస్కారం



**డోన్ నంది పత్రిక సెప్టెంబర్ 13** డోన్ తాలూకా వినియోగదారుల రక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఏఈ నాగరాజు గౌడు కు పుట్టపర్తి లో జరిగిన జాతీయ కేంద్రా వినియోగదారుల సమైక్య కన్స్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ చైర్మన్ అభిషేక్ వాస్తవ చేతుల మీదుగా సన్మానించి ఏమంటుందో అందజేసి జాతీయ ఉత్తమ ప్రశంస పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు పౌరసరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమైక్య చైర్మన్ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యి కమిషనర్ ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీనియర్ న్యాయవాది మూర్తి తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది గౌరీ శంకర్ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల వినియోగదారుల సంఘాల వ్యవస్థాపక అధ్యక్షులు మండడి కృష్ణారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏఈ నాగరాజు మాట్లాడుతూ వినియోగదారుల ఉద్యమం 12 1 1996 స్వామి వివేకానంద జయంతి రోజు డోన్ తలూకా వినియోగదారుల రక్షణ సంఘం ఏర్పాటు చేసి అప్పటినుండి 31 సంవత్సరాలు ప్రభుత్వం నుండి గాని ప్రజల నుండి గాని ఎటువంటి నిధులను సేకరించకుండా వినియోగదారులకు సేవలు అందించినందుకు జాతీయ స్థాయి పురస్కారములు అందుకోవడము చాలా ఆనందంగా ఉందని భవిష్యత్తులో మరిన్ని సేవలను వినియోగదారులకు ప్రజలకు అందజేస్తానని ఆయన తెలియజేశారు.

# ప్రకృతికి ప్రణామం.. గణపయ్యకు జైకొడదాం!

### జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ కల్లూరు మండల ఉపాధ్యక్షుడు నాగేంద్రుడు

### మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపు



**నంది పత్రిక కర్నూలు ప్రతినిధి** సిద్ధిబుద్ధుల ప్రదాత అయిన శ్రీ మహాగణపతి ఆశీస్సులతో జిల్లా సర్వతోముఖాభివృద్ధి సాధించాలని, ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, పాడిపంటలు వెల్లివిరియాలని భారతీయ జనతా పార్టీ కల్లూరు మండల ఉపాధ్యక్షుడు నాగేంద్రుడు ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన నియోజకవర్గ, జిల్లా ప్రజలకు హృదయపూర్వక పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాగేంద్రుడు మాట్లాడుతూ.. విఘ్ననాయకుడైన వినాయకుని కృపతో ప్రజలు తలపెట్టే ప్రతి సత్కార్యం దిగ్విజయంగా పూర్తి కావాలని, ఇంటా బయటా విజయాలు సిద్ధించాలని ప్రార్థించారు. ఆధ్యాత్మిక సంబరాలతో పాటు పర్యావరణ పరిరక్షణను ఒక సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. రసాయన రంగులతో తయారుచేసిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) విగ్రహాల వల్ల జలవనరులు, జీవకోటి తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సంప్రదాయాన్ని కాపాడుతూనే భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి గల్లీలో, ప్రతి ఇంట్లో మట్టి వినాయక ప్రతిమలనే ప్రతిష్ఠించి పూజలు నిర్వహించాలని కోరారు. పండుగ సంస్కృతి ప్రకృతికి మేలు చేసేలా ఉండాలని, భక్తిశ్రద్ధలు, శాంతిభద్రతల నడుమ ఈ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# డిఎస్సీ స్పోర్ట్స్ కోటాలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి ప్రభుత్వం తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలి-సిపిఎం




**డోన్ :నంది పత్రిక సెప్టెంబర్ 12** రాష్ట్ర ప్రభుత్వం 2025లో నిర్వహించిన డీఎస్సీ లో జరిగిన డిఎస్సీ స్పోర్ట్స్ కోటాలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి రాష్ట్ర ప్రభుత్వం మరియు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలి. సిపియం పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీయం పట్టణ కార్యదర్శి నక్కీ శ్రీకాంత్, పట్టణ కమిటీ సభ్యులు షేమిమ్ బేగం, అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని నిరుద్యోగుల సమస్య తీరుస్తామని ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు మొదటి సంతకం పెట్టి డిఎస్సి ద్వారా భర్తీ చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 2025 లో విడుదల చేసిన డీఎస్సీ ద్వారా భర్తీ చేసి నియమకాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు విద్యాశాఖ మంత్రి తమకు ఇష్టం వచ్చినట్లు సంస్కరణలు జీవోలు తీసుకువచ్చి ఇష్టానుసారంగా నియామకాలు చేపట్టారని వారు విమర్శించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాపై వస్తున్న విమర్శలకు రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న వివరణ మరిన్ని కొత్త సందేహాలను కలిగిస్తున్నదని వారన్నారు. ఉద్యోగ నియామకాల్లో మార్గదర్శకాలను ఇష్టానుసారంగా మార్చుకున్నట్లు అనేక ఆధారాలు ఇటీవల వెలుగులోకి వస్తున్నాయి. కొద్దిమందిని ఇప్పటికే అరెస్టు చేయడం, మరికొన్ని ఘటనలపై విచారణ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం ద్వారా స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అవకతవకలు జరిగినట్లు స్పష్టమవుతున్నది.విద్యా శాఖ మంత్రి,రాష్ట్ర ప్రభుత్వం జరిగిన అక్రమాలను, అవకతవకలను,తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు మేకపోతు గాంభీరం ప్రదర్శిస్తూ ఎదురు దాడి చేయడం చాలా దుర్మార్గం తమ నిజాయతీ నిరూపించుకునేందుకు స్వతంత్ర సంస్థతో సమగ్రంగా, నిస్పక్షపాతంగా విచారణ జరిపించి తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ రాష్ట్రంలో నియంత పాలన చేస్తున్నారని సమస్యలు పరిష్కరించాలని మా హక్కులు మాకు ఇవ్వాలంటూ కాకినాడలో

**కానిస్టేబుల్ నియామకాలు వెంటనే చేపట్టాలి** పోలీసు శాఖలో 19,999 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వాటిని త్వరలోనే భర్తీ చేస్తామని గతంలో హోమ్ శాఖామాత్యులు ప్రకటించారు. ఇందులో 11,639 పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతించినట్లు ప్రచారం జరిగింది. అయితే కేవలం 1600 పోస్టులకు మాత్రమే ఇప్పుడు నోటిఫికేషన్ ఇవ్వడం పట్ల యువతలో తీవ్ర నిరసన, ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ప్రభుత్వం గతంలో ప్రకటించిన విధంగా సుమారు 20 వేల పోస్టులను తక్షణం భర్తీ చేయాలని శాంతియుత ఆందోళన చేస్తున్న నిరుద్యోగులపై మరియు తిరుపతిలో పారామెడికల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని శాంతియుత నిరసన తెలియజేసిన విద్యార్థులపై పోలీసులతో విచక్షణారహితంగా మహిళలు అని కూడా చూడకుండా నడిరోడ్డుపై దౌర్జన్యాలకు దిప్పుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైశాచికి ఆనందం పొందుతున్నారని వారి విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం హామీలు, హక్కులు నెరవేర్చాలని ప్రశ్నిస్తున్న నిరుద్యోగులపై,విద్యార్థుల పై కార్మిక కర్షకులపై, ప్రజలపై పోలీస్ వ్యవస్థను రాష్ట్రంలో భ్రష్టు పట్టిస్తూ తమ జేబు సంస్థగా మార్చుకొని ప్రశ్నించే గొంతుకులపై నిర్బంధాలకు,దౌర్జన్యాలకు రాబోవు కాలంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు.

# పరిస్థితి వినాయక చవతి శుభాకాంక్షలు తోటి మట్టి విగ్రహములు పూజించండి. పర్యావరణాన్ని కాపాడండి.

**నంది ప్రతినిధి, సెప్టెంబర్ 13, కడప జిల్లా.** 22 వ డివిజన్ టిడిపి ఇన్చార్జ్ పుట్టు బోయిన శ్రీనివాసులు, ఆధ్వర్యంలో మారుతి నగర్ మరియు రాజారెడ్డి వీధిలో ఉచిత మట్టి విగ్రహముల వినాయక విగ్రహముల పంపిణీ జరుగుతున్నది. బూత్ ఇన్చార్జ్ బాలాజీ, కిషోర్ కుమార్, చంద్రశేఖర్, లక్ష్మణ్, విరివిగా ప్రజలు పాల్గొని మట్టి విగ్రహాలను తీసుకువెళు తున్నారు



# సమాజ హితం కోసమే "సహినం "





**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 13 :** పూర్వపు రోజుల్లో వర్షాలు పోయకపోతే హోమాలు యజ్ఞలు, గ్రామ దేవతలకు పూజలు, జలాభిషేకాలు నిర్వహిస్తూ ఉండేవారు. ఇలా హోమాలు యజ్ఞాలు అభిషేకాలు చేస్తే సమృద్ధిగా వర్షాలు కురు స్తాయి అన్న సాంప్రదాయం అనాదిగా జరుగుతూ ఉంది. ఈ కోవ కు చెందినదే సహినం కార్యక్రమం. సమాజ హితం కోసం చేసేదే సహినం . కాలక్రమేనా ఈ సహినం పేరు కాస్త సగినంగా మారిపోయింది. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరులోని మఠంపేటలో ఈ కార్యక్రమం అత్యంత ప్రసిద్ధి చెందింది. వందల సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో ఓ సిద్ధుడు తలారి ఎల్లమ్మ ఇంటి వద్దనున్న వేపచెట్టు వద్ద యంత్ర ప్రతిష్ట చేశారని పెద్దలు చెబుతూ ఉంటారు. వర్షం ఏ సమయాల్లో కురుస్తుందో అని తెలుసుకొని అందుకు అనుగుణంగా జొన్న పంటలు వేసుకునేందుకుగాను ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉండేవారు. అత్యంత నియమ నిష్ఠలతో ఈ కార్యక్రమాన్ని చేపడతారు. ఎప్పుడో 25 సంవత్సరాల క్రితం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండటంతో సహినం కార్యక్రమాన్ని చేపట్టాలని పూనుకున్నారు. ఇందుకు గ్రామ పెద్ద అయిన దేసు సంజీవరెడ్డి అందరిని సమైక్యపరిచేలా చర్యలు చేపట్టారు. ఎన్నో సంవత్సరాల నుండి మరుగున పడిపోయిన ఈ సహినం యొక్క ప్రాముఖ్యతను గురించి ప్రజలకు తెలియాలన్న ఉద్దేశంతో అందరిని సమైక్యపరిచేందుకు కంకణం కట్టుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆదివారం సహినం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఆచారం చిత్ర విచిత్రంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో క్షత్రియ కులానికి చెందిన సామాజిక వర్గం అధికంగా ఉండటంతో వారిచేతనే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

తోగట వీర క్షత్రియులు కుందూ నదిలో స్నానం ఆచరించి, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం చేపట్టే ముందు తొగటవీర క్షత్రియులంతా ఉపవాస దీక్షలో ఉంటారు.యంత్రం వేసిన ప్రాంతంలో ఓ మోస్తరుగా జొన్నలు వేస్తారు. ఈ జొన్నలను అనాదిగా కసిరెడ్డి వంశస్తుల ఇంటి నుండి తీసుకొని రావడమే ఆచారంగా జరుగుతూ ఉంది. కొత్త కడవతో నీటిని నింపి జొన్నలు వేసిన ప్రదేశంలో ఉంచుతారు. తర్వాత టెంకాయ కొట్టిన అనంతరం తొగటవీర క్షత్రియులు కొందరు కడవకు చేతులు ఆన్చి పట్టుకొని ఉంటారు. మంత్ర ప్రభావం కారణంగా కడవ దానంతట అదే తిరుగుతూ, ఏ దిశ వైపు వర్షాలు కురుస్తాయో ఆ వైపుకు ఒరిగిపోతుంది. ఉత్తర,హస్త,చిత్త కార్తుల పేరు చెప్పి కడవను పట్టు కుంటారు. ఒక్కొక్క కార్తీ లో నాలుగు పాదాలు చొప్పున చెబుతూ కూడా కడవను పట్టుకోవడం జరుగుతుంది. సహినం కార్యక్రమం ద్వారా వెలువడిన ఫలితాలను దృష్టిలో ఉంచుకొని, రైతులు జొన్నల విత్తనాలకు పూనుకుంటారు. ఈ ఫలితాల ఆధారంగానే ఎన్నోసార్లు విత్తనాలు వేసు కోవడం జరిగిందని కూడా పెద్దలు చెబుతారు. ఆదివారం నిర్వహించిన ఈ సగినం కార్యక్రమంలో ఉత్తర,కార్తి రెండవ నాలుగు పాదాల్లో కొద్దిపాటి వర్షం, హస్త కార్తిలో రెండు నాలుగు పాదాల్లో కూడా కొద్దిపాటి వర్షం కురుస్తుందని సగినం కార్యక్రమం ద్వారా గుర్తించారు. స్వాతి పార్టీలో మూడవ పాదంలో కొద్దిపాటి వర్షం కురుస్తుందని, చిత్త కార్తీ లో రెండవ పాదంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని సగినం కార్యక్రమంలో గుర్తించారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ సగినం కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు తండోపతండాలుగా వస్తూ ఉండేవారు. కాలక్రమేనా ఈ కార్యక్రమం మరుగున పడిపోవడం వల్ల దీని ప్రాముఖ్యత కూడా మరుగున పడిపోయింది. ఇకనుంచి అయినా ఈ కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా ముందుకు కొనసాగించేందుకు గ్రామ పెద్దలు, అన్ని సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు పూనుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎంతో విశిష్టత మహిమాన్వితమైన ఈ ప్రాంతంలోని అరుగు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఈ ప్రదేశాన్ని పునరుద్ధరించేందుకు గ్రామ కమిటీతో పాటు ప్రజలు కూడా పూనుకొని పూర్వ వైభవాన్ని తీసుకొని వచ్చేందుకు కృషి చేయాల్సిన అవసరం కూడా ఎంతైనా ఉంది.





## జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

**కలిసిమెలిసి సోదరభావంతో వినాయక చవితి వేడుకలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి.**

**పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.**

**సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దు.. షేర్ చేయవద్దు.**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** సెప్టెంబర్ 14వ తేదీ సోమవారం వినాయక చవితి పండుగను పురస్కరించుకొని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బంది , మీడియా మిత్రులకు వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సోదరభావం, మత సామరస్యంతో వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.జిల్లాలోని వినాయక మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఇతరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విగ్రహాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని, రాత్రి వేళల్లో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నిబంధనల మేరకు మాత్రమే సౌండ్ సిస్టమ్‌లను వినియోగించాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని మండపాల నిర్వాహకులకు సూచించారు.వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు, మత పెద్దలు, యువత, ప్రజాప్రతినిధులు, మీడియా మరియు అన్ని వర్గాల వారు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే అసత్య ప్రచారాలు, వదంతులను ప్రజలు నమ్మవద్దని, వాటిని ఇతరులకు షేర్ చేయకుండా నిజానిజాలను నిర్ధారించుకునేందుకు వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు లేదా సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత స్థానిక పోలీసులకు, డయల్-112 లేదా డయల్-100కు సమాచారం అందించాలని జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## వినాయక చవితి శుభాకాంక్షలు

**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బోయ క్రాంతి నాయుడు**



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అడ్వకేట్ బోయ క్రాంతి నాయుడు వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. హిందువులకు ముఖ్యమైన పండుగల్లో వినాయక చవితి పెద్ద పండుగని కావున హిందూ సోదరులు కుటుంబ సభ్యులతో ఈ పండుగను ఆనందంగా జరుపుకొని గణనాధుని కృపకు పాత్రులు కాగలరని అలాగే తొమ్మిది రోజులు జరిగే నవరాత్రి ఉత్సవాలలో కుల, మత, పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా వీధి వారందరూ కలిసి ప్రతి వీధిలో వినాయకుని విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు చేయడం, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందంగా జరుపుకోవడం ఈ పండుగ ప్రత్యేకత అని అధికారులు చొరవ తీసుకొని వినాయక మండపాల ప్రదేశాలలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించగలరని క్రాంతి నాయుడు కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను కోరారు.

## ముున్సిపల్ ఎన్నికల్లో కూటమి నేతలు సమన్వయంతో విజయ ఢంకా మోగించాలి.

**మున్సిపల్ పీఠంపై జండా ఎగరువేయాలి.**

**అభ్యర్థుల విజయానికి సైనికుల్లా పనిచేయాలి.**



**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 13 ( నంది పత్రిక )** మున్సిపల్ ఎన్నికల్లో కూటమి నేతలు సమన్వయంతో విజయ ఢంకా మోగించాలని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి,పాణ్యం ఎమ్మెల్యే,టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత పేర్కొన్నారు.నంద్యాల అర్.అండ్.బి అతిథి గృహంలో కూటమి పార్టీ జిల్లా అధ్యక్షుల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి,పాణ్యం ఎమ్మెల్యే,టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత ముఖ్య అతిధులుగా హాజరైన సమావేశానికి నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు,జన సేన ఎన్నికల కమిటీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల మున్సిపల్ ఎన్నికల్లో కూటమి నేతలు సమన్వయంతో విజయ ఢంకా మోగించాలని అన్నారు.కూటమి అభ్యర్థులు విజయానికి ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలన్నారు.నంద్యాల మున్సిపల్ పీఠంపై జండా ఎగురవేయడానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో పోటీ నిలబడే అభ్యర్థులు వివరాలు,వార్డులో వారికి ఉన్న పట్టు తదితర అంశాలపై చర్చించారు.అధిష్టానం నిర్ణయం మేరకు వార్డుల్లో గెలిచే అభ్యర్థులకే ప్రాధాన్యత ఇస్తున్నారు.వార్డుల్లో కూటమి లోని ఏ పార్టీ అభ్యర్థి పోటీలో నిలబడినా కలిసి కట్టుగా అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకమైన ఎన్నికలు కావడంతో అన్ని ప్రాంతాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కూటమి నేతలు అన్ని విధాలుగా అభ్యర్థుల విజయానికి కావలసిన కార్యాచరణ రూపొందిస్తున్నారని అన్నారు.నోటిఫికేషన్ విడుదల వెంటనే కూటమి నేతలు అందరూ కలిసి ఆయా వార్డుల్లో అభ్యర్థుల బలా బలాలు బేరీజు వేసుకొని అందరికీ సముచిత న్యాయం కల్పిస్తామన్నారు.అభ్యర్థులు కూటమి చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి లోతుగా తీసుకొని పోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో కూటమి సత్తా చాటుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న కర్నూలు పోలీసులు.

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి.**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

## బంగారుపేటలో కార్డెన్ సర్చ్ ఆపరేషన్

**15 లీటర్ల నాటు సారా స్వాధీనం.**

**60 లీటర్ల నాటు సారా బెల్లం ఊట ధ్వంసం.**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, కర్నూలు డీఎస్పీ కె.వి. రాఘవేంద్ర పర్యవేక్షణలో ఆదివారం కర్నూలు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బంగారుపేటలో కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.కర్నూలు నగర సీఐలు, పోలీసు సిబ్బందితో పాటు ఎక్సైజ్ శాఖ ఏ ఈ యస్ లు, సీఐలు, సిబ్బంది మరియు ఈగల్ టీమ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.ఈ కార్డెన్ సర్చ్ ఆపరేషన్‌లో 15 లీటర్ల నాటు సారా ను స్వాధీనం చేసుకోగా, 60 లీటర్ల నాటు సారా ఊటబెల్లమును గుర్తించి ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా కర్నూల్ డిఎస్పి మాట్లాడుతూ...నాటుసారా తయారీ, విక్రయాలకు దూరంగా ఉండాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే డయల్ 112 లేదా డయల్ 100 లేదా ఈగల్ టోల్ ఫ్రీ 1972కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ డిఎస్పీ తో పాటు కర్నూలు నగర సీఐలు శ్రీధర్, శేషయ్య, మారుతి శంకర్, ఎక్సైజ్ శాఖ ఏ ఈ యస్ లు రాజశేఖర్ గౌడ్, రామకృష్ణారెడ్డి, ఎక్సైజ్ సిఐ లు చంద్రహాస్, జయరామ్ నాయుడు, రాజేంద్ర ప్రసాద్ కిషోర్, ఈగల్ టీమ్ ఎస్సై రమేశ్ నాయక్ , ఈగల్ టీం సిబ్బంది, సంబంధిత పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## నెట్టకల్ టీడీపీ ఎంపిటిసి రేసులో రవీంద్ర సింగ్

**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** ఆదోని మండల పరిధిలోని నెట్టేకల్ గ్రామానికి చెందిన రవీంద్ర సింగ్ రాబోయే ఎంపిటిసి ఎన్నికల రేసులో ముందు వరుసలో ఉన్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. గత కొన్ని ఏళ్లుగా రవీంద్ర సింగ్ వారి కుటుంబం టిడిపి పార్టీకి సేవలందిస్తూ ముందుకు సాగుతున్నారు. పార్టీ కూడా రవీంద్ర సింగ్ ను గుర్తించి 72వ బూత్ ఇన్చార్జిగా నియమించింది. ఇప్పటికే గ్రామంలో రవీంద్ర సింగ్ కు ప్రజల్లో మంచి పట్టు ఉందని తెలుస్తుంది. నాయకులు కూడా రవీంద్ర సింగ్ కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారు. రాబోయే ఎంపీటీసీ ఎన్నికల్లో టిడిపి పార్టీ నుండి కచ్చితంగా రవీంద్ర సింగ్ పేరు అధిష్టానం నుండి వస్తుందని రవీంద్ర సింగ్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టిడిపి జెండా ఎగురుతుందని రవీంద్ర సింగ్ వర్గం నాయకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే మండలంలో సింగ్ సామాజిక వర్గం నుండి ఎవరు కూడా ఎంపీటీసీగా పోటీ చేయలేదు ఈసారి రవీంద్ర సింగ్ కు ఎంపీటీసీ అవకాశమిస్తే అఖండ మెజార్టీతో గెలిపిస్తామని టిడిపి శ్రేణులు పేర్కొంటున్నారు. ఇటు మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు ఆశీస్సులు కూడా రవీంద్ర సింగ్ కు పుష్కలంగా ఉన్నాయి. ఇప్పటికే డోర్ టు డోర్ కార్యక్రమంలో రవీంద్ర సింగ్ 72వ బూత్ లో వందకు వంద శాతం గడువు లోపు పూర్తి చేయడం కూడా రవీంద్ర సింగ్ కు కలిసి వచ్చే అంశం సింగ్ వర్గీయులు అనుకుంటున్నారు



## వినాయక నిమజ్జనానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన పోలీసు అధికారులు**

**అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు**

**నిబంధనలు పాటిస్తూ నిమజ్జనం నిర్వహించాలి : ఆళ్లగడ్డ డీఎస్పీ శ్రీనివాసరావు**

**భక్తుల భద్రతే లక్ష్యంగా పోలీసుల పటిష్ట బందోబస్తు : సీఐ రాము , ఎస్సై మధుసూదన**



**శిరివెళ్ళ : (నంది పత్రిక)** వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా శిరివెళ్ళ పోలీసులు ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు.భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిమజ్జన ప్రాంతాలను ముందుగానే పరిశీలించి , ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలపై అధికారులు దృష్టి సారించారు.ఇందులో భాగంగా శిరివెళ్ళ సమీపంలోని మాల వాగు , వక్కిలేరు వాగు , కోటపాడుయాళ్ళూరు మధ్య ఉన్న కేసీ కెనాల్ కాలువలను ఆళ్లగడ్డ డీఎస్పీ శ్రీనివాసరావు , శిరివెళ్ళ సీఐ రాము , ఎస్సై మధుసూదన్‌తో పాటు పోలీసు సిబ్బంది పరిశీలించారు.నిమజ్జనం సమయంలో భక్తులు , నిర్వాహకులు ఎలాంటి తొందరపాటుకు గురికాకుండా పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు.అధికారులు నిర్దేశించిన సమయానికే నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని , ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా వాహనాలను క్రమబద్ధంగా నిలపాలని తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు నీటిలోకి దిగి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని , ముఖ్యంగా చిన్నారులు , వృద్ధులు , మహిళల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలనీ సూచించారు.అలాగే ఈత రాని వారు నీటిలోకి వెళ్లకూడదని , మద్యం సేవించి నిమజ్జన ప్రాంతాలకు రావద్దని , విగ్రహాలను తరలించే సమయంలో పరిమితికి మించి వ్యక్తులు వాహనాలపై ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పోలీసుల సూచనలను ఉల్లంఘిస్తే ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని , ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.వినాయక నిమజ్జనం ప్రశాంతంగా , భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక భద్రతా చర్యలు చేపడుతోంది. నిమజ్జన ప్రాంతాల్లో పోలీసుల పర్యవేక్షణ , బందోబస్తు , రాకపోకల నియంత్రణ వంటి చర్యలను సమన్వయంతో చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.ప్రజలు పోలీసు శాఖకు సహకరించి నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా నిమజ్జన వేడుకలను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. భక్తుల ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని డీఎస్పీ శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

## బేతంచెర్ల 28 కౌన్సిల్ వార్డులకు 56 పోలింగ్ స్టేషన్ ల తుది జాబితా విడుదల.

**బేతంచెర్ల నగర పంచాయితీ కమీషనర్ హరిప్రసాద్.**



**బేతంచెర్ల సెప్టెంబర్ 13 ( నంది పత్రిక ).** బేతంచర్ల నగర పంచాయతీ పరిధిలో గల 28 కౌన్సిల్ వార్డులకు,అధికారులు గుర్తించిన 56 పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను ఆదివారం నాడు బేతంచెర్ల నగర పంచాయితీ కమీషనర్ విడుదల చేశారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా, బేతంచర్ల నగర పంచాయతీ పరిధిలోని 28 వార్డులకు గాను, మొత్తం 56 పోలింగ్ స్టేషన్ల (పోలింగ్ స్టేషన్స్ ) ముసాయిదా తుది జాబితాను 13.09.2026 న నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ డి హరి ప్రసాద్ తోపాటు టి పి ఓ శబరీష్, మేనేజర్ అబిదా బేగం,సీనియర్ అసిస్టెంట్ జిలానీ భాష మరియు అధికారులు నగర పంచాయతీ ఎలక్షన్ టీం విడుదల చేయడమైంది పోలింగ్ స్టేషన్ల వివరాలను నగర పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డు నందు ప్రచురించడ మైనదని కమీషనర్ హరిప్రసాద్ ప్రకటన ద్వారా తెలిపారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి.. కష్టకాలంలో పార్టీ కోసం నిలిచిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

## కాటసాని రామభూపాల్ రెడ్డి

**కర్నూల్ సిటీ నందిపత్రిక** ఓర్వకల్లు మండల విస్తృత స్థాయి సమావేశం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి నాయకులు, కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులను అందజేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరికీ గుర్తింపు, గౌరవం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.అనంతరం కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు మన నాయకులు, కార్యకర్తలందరికీ అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధమై పార్టీ విజయానికి కష్టపడాలని పిలుపునిచ్చారు. నాయకులుకార్యకర్తలు అందరూ ఐక్యంగా పనిచేయాలని, మన పార్టీ బలం కార్యకర్తలేనని, వైఎస్ జగన్ మోహన్ రెడ్డినాయకత్వాన్ని బలోపేతం చేయడమే ప్రతి ఒక్కరి లక్ష్యంగా ఉండాలని అన్నారు.కష్టకాలంలో పార్టీ కోసం నిలిచిన వారిని మర్చిపోం.అధికారంలో ఉన్నప్పుడు అనేకమంది నాయకులు, కార్యకర్తలకు ఆశించిన స్థాయిలో అండగా నిలవలేకపోయామని, అయితే ఈ కష్టకాలంలో పార్టీని నమ్ముకుని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీ కోసం నిలిచిన ప్రతి ఒక్కరినీ గుర్తుంచుకుంటామని కాటసాని స్పష్టం చేశారు అధికారులు రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహించాలి.పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు సహా ప్రభుత్వ ఉద్యోగులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా చట్టం, రాజ్యాంగం ప్రకారం నిష్పక్షపాతంగా తమ విధులు నిర్వహించాలని కాటసాని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు న్యాయం చేయాల్సిన అధికారులు రాజకీయ పక్షపాతంతో వ్యవహరించడం సరికాదని, ఎవరైనా అన్యాయంగా వ్యవహరిస్తే భవిష్యత్‌లో చట్టబద్ధమైన సమీక్ష, బాధ్యత తప్పదని స్పష్టం చేశారు.రైతుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యం. రైతుల పరిస్థితిని ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని కాటసాని అన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చామని, ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రజలు ఆలోచించాలని కోరారు.రైతుల నుంచి భూములు తీసుకున్న పరిశ్రమలు, సంస్థలు వారి కుటుంబాలకు, వారి పిల్లలకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంలో రాజకీయ వివక్ష చూపకూడదు. రైతు ఏ పార్టీకి చెందిన వారైనా, భూమి ఇచ్చిన రైతు కుటుంబానికి న్యాయం జరగాల్సిందే అని స్పష్టం చేశారు.ఉద్యోగాలు, కాంట్రాక్టులు, పనులు వంటి అవకాశాల్లో "మనవాళ్లువాళ్లవాళ్లు" అనే రాజకీయ తేడాలు లేకుండా అర్హత, న్యాయం ఆధారంగా అవకాశాలు కల్పించాలని కోరారు.అధికారం శాశ్వతం కాదు.అధికారం ఎవరికీ శాశ్వతం కాదు.. ప్రజలే అంతిమ నిర్ణేతలు. ఈరోజు అధికారంలో ఉన్నవారు రేపు ప్రతిపక్షంలో ఉండొచ్చు.. ఈరోజు ప్రతిపక్షంలో ఉన్నవారు రేపు అధికారంలోకి రావొచ్చు. కాబట్టి ప్రజలకు, రైతులకు, కార్యకర్తలకు న్యాయం చేసే విధంగా అందరూ వ్యవహరించాలి" అని కాటసాని అన్నారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసి,నాయకులుకార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కష్టకాలంలో పార్టీ కోసం నిలిచిన ప్రతి నాయకుడికి గుర్తింపు.. ప్రతి కార్యకర్తకు గౌరవం.. రైతులకు న్యాయం.. జగన్ నాయకత్వంలో జరుగుతుంది అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండల జడ్పీటిసి, ఎంపీటీసీలు, ఎంపీపీలు, మండల నాయకులు, అనుబంధ విభాగాలలో వివిధ హోదాలలో ఉన్నవారు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# వైసిపి సీనియర్ నాయకుడు బసరుకోడు మాజీ వైస్ సర్పంచు ఈరన్న ను పరామర్శించిన ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి



**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** బసరకోడు గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు మాజీ వైస్ సర్పంచ్ గొల్ల ఈరన్న కు నిన్న టి రోజున పెరాలసిస్ రావడం వల్ల ఈరోజు విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై సాయి ప్రసాద్ రెడ్డి గారు చంద్రకాంత్ రెడ్డి గారు బసరకోడు నాగభూషణ రెడ్డిగారు తాలూకా యూత్ అధ్యక్షుడు ఎ.నల్లారెడ్డి గారు మాజీ విద్యా కమిటీ చైర్మన్ బోయ నల్లన్న వీ. ఉచ్చిరప్ప బ్రహ్మయ్య ఆచారి గొల్ల ఉరుకుంద బోయ రామన్న మూలింటి వెంకటేశ్వర రెడ్డి ఈరన్న నివాసానికి వచ్చి తన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని తనకు అన్ని విధాల తోడుగా ఉంటానని ఆ ధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని ఆర్థిక సాయం అందించి ఇంకా ఏదైనా అవసరం ఉంటే వచ్చి కలవమని కుటుంబ సభ్యులకు చెప్పడం జరిగింది అన్ని విధాలుగా కుటుంబానికి తోడుగా ఉంటానని ధైర్యం చెప్పడం జరిగింది

# ఈసారి 41 రూపాల్లో దర్శనమివ్వనున్న లంబోధరుడు: వెలుగోడులో ఘనంగా వినాయక చవితి ఏర్పాట్లు!



**వెలుగోడు సెప్టెంబర్ 13 (నంది పత్రిక):**వినాయక చవితి పురస్కరించుకుని వెలుగోడు మండలంలో గణేష్ మండపాలను నిర్వాహకులు అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పట్టణంలోని పోస్టాఫీస్ సమీపంలో తమ్మినేని నాగన్న ఏర్పాటు చేసిన గణేష్ మండపం ప్రత్యేక ఆకర్షణగా, పట్టణానికే హైలెట్‌గా నిలిచింది. గతేడాది మండలంలో 35 విగ్రహాలను ప్రతిష్ఠించగా, ఈసారి ఉత్సవ కమిటీ పర్యవేక్షణలో ఆ సంఖ్య 41కి పెరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం విగ్రహాలను ప్రతిష్ఠించి, మూడు రోజుల పాటు విశేష పూజలు నిర్వహించిన అనంతరం నాలుగో రోజున నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

# అధిక ధరలకు ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు







## జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ ఎం. జయకృష్ణ ఆదేశాలు.

**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 13 నంది పత్రిక** జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ ఆదేశాల మేరకు, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని భక్తుల రద్దీ అధికంగా ఉన్న ప్రాంతాల్లో హోటళ్లు, షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగరంలోని హోటల్స్ లో, దుకాణాలలో భక్తులకు, ప్రజలకు అధిక ధరలకు ఆహారం పదార్థాలు విక్రయించినా, పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచుకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ ఆదేశాల మేరకు ఆదివారం నగరంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితరా ప్రాంతాల్లోని హోటల్స్, దుకాణాల్లో హెల్త్ ఆఫీసర్, లీగల్ మెట్రోలజీ ఇన్స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ లోపల, బయట యాత్రికులు వియోగించే ఆహరపదార్థాలు అమ్మే 25 హోటల్స్ మరియ షాప్ లను ఆకస్మికంగా తనిఖీ చేసిరి ఇందులో ఆర్టీసీ బస్టాండ్ నందు ఎమ్మార్పీ రెట్లకంటే ఎక్కువగా విక్రయించే ఆరు షాపులకు లీగల్ మెట్రోలజీ ఇన్స్పెక్టర్ కేసులు వ్రాసి పెనాలిటీ విధించడం జరిగినది మరికొన్నిచోట్లా పాకింగ్ ఆహార పదార్థాలు డేట్స్ ఎక్సపయిరి అయిన వాటిని గుర్తించి స్వాధీనం చేసుకొని డెస్ట్రాయ్ చేయడం జరిగినది మరియు వారికి పెనాలిటీ వేయడమైనది పూర్తిగా నాణ్యత పాటించని బస్టాండ్ లోని శరవణ ఫాస్ట్ ఫుడ్ హోటలను బస్టాండ్ బయట పంజాభి ధాబా హోటలను తాత్కాలికంగా సీజ్ చేయడమైనది కొన్ని హోటల్స్ ఐన హోటల్ ఒరియాన్, బాలాజీ వుడ్లాండ్స్ హోటల్, టేబుల్ 9 హోటల్స్ నాణ్యత పరిమానాలుపాటించడం తనిఖీలో గుర్తించడమైనది మరికొన్ని హోటల్స్ సరియైన ప్రమాణాలు పాటించక ఎలుకలు తిరగడం, బొద్దింకలు, బల్లులు తిరగడం, హోటల్స్ రూఫ్ పెచ్చులు లేసిపోవడం, పెయింట్ రాలిపోవడం గమనించడం జరిగింది వారందరికీ పెనాలిటీ వేసి నోటీసులు జారిచేయడమైనది ఫుడ్ సెఫ్టీ అధికారులు వారి పరిధిలో హోటల్స్ వారికీ హెచ్చరిక లు జారిచేసిరి ఈ సందర్భంగా తిరుపతి నగర పాలక సంస్థ కమీషనర్ గారు మాట్లాడుతూ నగరంలో శ్రీ వారి బ్రహ్మోత్సవాలకు పారిశుధ్య నిర్వహణ కు ప్రత్యేక శ్రద్ధ తీసుకోని యత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చేయడమైనదని అలాగే యత్రికులకు నాన్యమైన ఆహరం అందించడంలో హోటల్స్ మరియూ షాపులవారి పై నిరంతరం తనిఖీలు నిర్వహించి నాణ్యమైన ఆహరపదార్థాలు వీఁరా రెట్లకే అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇందులో ఎలాంటి అవకతవకలు జరిజిన హోటల్స్ పై కఠిన చర్యలు తీసుకొని వారి ట్రేడ్ లైసెన్స్ రద్దుచేసి హోటల్ సీజ్ చేయడం జరుగుతుంది మరియూ ప్రతి షాపు వారు, హోటల్స్ వారు ప్రతి ఇంటివారు రెండు డస్ట్ బిన్స్ పెట్టుకొని తడి పొడి వ్యర్థలను వేరుచేసి నిలువవుంచి మునిసిపల్ వాహనాలకు అందివ్వాలని అలాకాక రోడ్లపై పబ్లిక్ స్థలల్లో వ్యర్దాలు పారావేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోబడునని మన తిరుపతి ని పరిశుభ్రంగా ఉంచడంలో అందరు నగర పాలక సంస్థకు సహకరించాలని కమిసనర్ తెలిపారు.

# కర్నూలులో వినాయక నిమజ్జనం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.. మంత్రి టీజీ భరత్

## కేసి కెనాల్, నన్నూర్ టోల్ ప్లాజా వద్ద ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి టీజీ భరత్



**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలో వినాయక నిమజ్జనాన్ని ఘనంగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఆదివారం కర్నూలులోని వినాయక ఘాట్ వద్ద కేసీ కాలువ, నన్నూర్ టోల్ ప్లాజా వద్ద హంద్రీనీవా ప్రాంతాల్లో వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను మంత్రి టీజీ భరత్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి నిమజ్జన ఏర్పాట్లు, నీటి లభ్యత, భద్రత, మౌలిక సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. సుంకేసుల బ్యారేజీలో గత 20 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అత్యల్పంగా 0.288 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉందని మంత్రి తెలిపారు. దీంతో సుంకేసుల బ్యారేజీ నుంచి నేరుగా కేసీ కాలువకు నిమజ్జనం కోసం నీటిని విడుదల చేసే పరిస్థితి ఈసారి లేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించామన్నారు. వినాయక ఘాట్ వద్ద కేసీ కాలువలో ఎన్నడూ లేని విధంగా రెండు వైపులా గోడలు నిర్మించి ట్యాంక్ తరహాలో నీటిని నిల్వ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పంప్‌హౌస్ నుంచి ప్రతిరోజూ వృథాగా పోతున్న సుమారు 20 లక్షల లీటర్ల నీటిని కేసీ కాలువకు తరలించి, వినాయక ఘాట్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసే ట్యాంక్‌లో నిల్వ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో క్రేన్లు, ఇతర అవసరమైన సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం హంద్రీనీవాలో నీటి ప్రవాహం బాగుందని, వినాయక నిమజ్జనం సమయంలో కూడా నిరంతర నీటి ప్రవాహం ఉండే అవకాశం ఉందన్నారు. కేసీ కాలువ, నన్నూర్ టోల్ గేట్ వద్ద హంద్రీనీవా ప్రాంతాలను వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు పరిశీలించాలని మంత్రి సూచించారు. కమిటీ సభ్యుల పరిశీలన, వారి నిర్ణయం ఆధారంగా నిమజ్జనానికి సంబంధించిన తుది ప్రణాళికను రూపొందిస్తామని తెలిపారు. వచ్చే జూన్ వరకు తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తాగునీటికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూనే వినాయక నిమజ్జనాన్ని కూడా ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలులో రాష్ట్రంలోనే అత్యంత వైభవంగా వినాయక నిమజ్జనం నిర్వహించేలా ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



# ఉత్తమ అవార్డు గ్రహీత రోటరీ క్లబ్ అధ్యక్షుడు



## పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి కి రోటరీ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఘన సన్మానంలి

## అధ్యాపకుడిగా రోటరీ క్లబ్ అధ్యక్షులుగా సేవలందించడం పూర్వజన్మ సుకృతం

## రోటరీ క్లబ్ అధ్యక్షులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి

**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 13 నంది పత్రిక** విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతూ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ రోటరీ క్లబ్ అధ్యక్షులుగా సేవా కార్యక్రమాలతో సేవా దృక్పథంతో పనిచేస్తూ అందరి మన్నలు పొందిన అధ్యాపకుడు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డిని రోటరీ క్లబ్ తరఫున రోటరీ క్లబ్ సభ్యులందరూ ఘనంగా సన్మానించడం అపురూపమని అలాంటి అదృష్టం పిచ్చల మల్లేశ్వర రెడ్డికి రావడం మంచి పరిణామమని రిటైర్డ్ ప్రిన్సిపాల్ రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు శంకర్ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఉత్తమ అవార్డు పురస్కారం అందుకున్న సందర్భముగా ఆదివారం నాడు ఆళ్లగడ్డ పట్టణంలోని రోటరీ కార్యాలయంలోని సమావేశం మందిరంలో ఆయనను ఘనంగా శాలువలు పూలమాలలతో సన్మానించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త రోటరీ పాస్ట్ ప్రెసిడెంట్ టిఎంసి వేణు గోపాల్ మాట్లాడుతూ అటు ఉపాధ్యాయుడిగా ఇటు రోటరీ క్లబ్ అధ్యక్షులుగా సేవలందించిన మల్లేశ్వర్ రెడ్డి ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ కు పేరు ప్రఖ్యాతలు తేవడం ఆయనకు ఆయనే సాటిగా నిలిచారన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని రాష్ట్రస్థాయిలో అవార్డులు పొందాలని ఆయన ఆకాంక్షించారు .పాస్ట్ ప్రెసిడెంట్ పాపిరెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడం రోటరీ క్లబ్ సభ్యుడుగా అధ్యక్షులుగా పనిచేయడం రోటరీ క్లబ్ కు గర్వకారణమని ఆయన సంతోషాన్ని వ్యక్తపరిచారు ఫాస్ట్ ప్రెసిడెంట్ దేవిశెట్టి హరిబాబు మాట్లాడుతూ తన అసమాన ప్రతిభతో ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ తెలుగు అధ్యాపకుడిగా విద్యార్థులకు చక్కటి బోధన అందిస్తూ తెలుగులో తన మధురమైన కంఠంతో సరళమైన చక్కని పద్య వచన పలుకుతూ విద్యావంతులుగా చేస్తూ అలాగే సమాజ సేవలో సమాజానికి తనవంతు సేవగా రోటరీ క్లబ్ తరఫున సామాజిక సేవలు అందిస్తున్న పిచ్చల మల్లేశ్వర్ రెడ్డికి ఘన సన్మానం జరగడం మన అందరి అదృష్టంగా భావిస్తున్నానన్నారు. మాజీ రోటరీ క్లబ్ ప్రధాన కార్యదర్శి బైసాని రవి ప్రకాష్ మాట్లాడుతూ ఆత్మీయ చిరునవ్వుతో అందరినీ ఆప్యాయతగా పలకరిస్తూ ఉపాధ్యాయుడుగా విద్యార్థులకు తన వంతు విద్యా బోధనలు అందిస్తూ తన వంతు సాయంగా సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో రోటరీ క్లబ్ లో అధ్యక్షులుగా స్వల్ప కాలమైన ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ కు వన్నె తెచ్చారన్నారు. సీనియర్ న్యాయవాది రోటరీ క్లబ్ సీనియర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయుడు రోటరీ క్లబ్ అధ్యక్షులుగా మనందరి మధ్య మనకు ఉండడం అటు ఉపాధ్యాయులుగా ఇటు రోటరీ అధ్యక్షులుగా ఇంకా సేవా కార్యక్రమాలతో ముందుకు తీసుకెళ్తారని తన అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు, రోటరీ క్లబ్ సభ్యులు రేపాకుల శ్రీనివాసులు మాట్లాడుతూ మిత్రుడు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డికి అవార్డు రావడం తనకు చాలా సంతోషాన్ని ఇచ్చిందని ఆ సంతోషాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నాను అన్నారు స్నేహితుడిగా తన ఆనందాన్ని వ్యక్తపరిచారు. క్లబ్బు సభ్యులు కే నరసింహుడు మాట్లాడుతూ



స్నేహానికి నిర్వచనం పిచ్చల మల్లేశ్వర రెడ్డి అని పట్టుదల క్రమశిక్షణ అంకితభావంతో పనిచేస్తున్న సందర్భంగానే ఉత్తమ అవార్డు రావడం జరిగిందని రాబోయే రోజుల్లో ఇంకా అవార్డులు పొందాలని కోరుకుంటున్నాను ఆయన తెలిపారు.అనంతరం సన్మాన గ్రహీత అధ్యాపకులు రోటరీ క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ అధ్యాపకులుగా రోటరీ క్లబ్ అధ్యక్షులుగా అందరి దీవెనలతో మంచి మనసుతో నన్ను ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ రాబోయే రోజుల్లో అందరి అభిప్రాయాలు సూచనల ప్రకారం అటు అధ్యాపకులుగా రోటరీ క్లబ్ అధ్యక్షులుగా సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికీ అందరివాడేగా ఉంటానని మీ అందరి ప్రేమ అభిమానులే నాకు శ్రీరామరక్ష అని అందరి ప్రేమ ఆశీర్వాదాలతోనే ఉత్తమ అవార్డు రావడం జరిగిందని రోటరీ క్లబ్ అధ్యక్షులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి తెలిపారు. **ఈ కార్యక్రమంలో సెక్రెటరీ గాండ్ల చంద్ర సేన** టీఎస్ సత్యనారాయణ మా టీవీ ప్రసాద్ నిచ్చెన మెట్ల రామయ్య,బ్యాంక్ బాలిరెడ్డి అంబటి లక్ష్మారెడ్డి శివ చంద్రారెడ్డి బండారు దస్తగిరి రేపాకుల శ్రీనివాసులు సిద్ధం రెడ్డి వెంకటరామిరెడ్డి మాజీ ప్రధాన కార్యదర్శి రత్నరాజు సుబ్బరామయ్య ఎమ్మెస్ నారాయణ రెడ్డి ఎస్ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత నడుం బిగించాలి :యస్ డి పి ఐ




**నందికొట్కూర్ సెప్టెంబర్ 13(నంది పత్రిక )**ఎస్ డి పి ఐ ఆధ్వర్యంలో పట్టణంలోనే రాయల్ ఫంక్షన్ హాల్ నందు ఆదివారం నందికొట్కూరు యాంగ్ డెమోక్రాట్స్ విభాగం అసెంబ్లీ కమిటీ ఏర్పాటు కార్యక్రమమును చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ డి పి ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజాస్ హుస్సేన్, యాంగ్ డెమొక్రటిక్ రాష్ట్ర అధ్యక్షులు జబ్బార్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి అంటే యువత చేతుల్లోనే రాజ్యాంగ పదవులు ఉండాలని, కానీ అందుకు విరుద్ధంగా యువతను ఓటర్లుగా చూస్తూ జెండాలు మోయడానికి పరిమితం చేస్తున్నారని ఇది ప్రధాన రాజకీయ పార్టీలకు ఉన్న చిత్తశుద్ధ అని విమర్శించారు. దేశ భవిష్యత్తు యువత పైన ఆధారపడింది కాబట్టి రాజ్యాంగ పదవులు, ప్రజాస్వామ్య పరిరక్షణకై యువతలో చేతన్యం నింపి వారిలో రాజ్యాధికారం చేతులో పెట్టే విధంగా ఎస్ డి పి ఐ ఒక వేదికగా భారతదేశంలో నిలుస్తుందని వారు పేర్కొన్నారు. నందికొట్కూరు లో కూడా ప్రజా సమస్యల పరిష్కారం కోసం యువత ఉద్యమించాలని, ప్రజాస్వామ్య పరిరక్షణకు యాంగ్ డెమొక్రటిక్ ను వేదికగా ఎంచుకొని ఆదరించాలని వారి పిలుపునిచ్చారు. అనంతరం 20 మంది సభ్యులతో కూడిన యాంగ్ డెమోక్రట్స్ అసెంబ్లీ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ అబ్దుల్ రహిమాన్ మరియు ఎస్ డి పి ఐ నాయకులు మరియు నూతన యాంగ్ డెమోక్రట్స్ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

## నేతన్న సేవలో కార్యక్రమం పై నేతన్నల హర్షం మంత్రికీ కృతజ్ఞతలు తెలిపిన నేతన్నలు



**బనగానపల్లె సెప్టెంబర్ 13నందిపత్రిక** నేతన్నల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం తీసుకవచ్చిన నేతన్న సేవలో కార్యక్రమం పై నేతన్నలు హర్షం వ్యక్తం చేశారు.ఆదివారం బనగానపల్లె మండల పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన పలువురు నేతన్నలు మంత్రి జనార్దన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వారితో చేనేత రంగ అభివృద్ధికి అన్ని విధాలా అండగా ఉంటాం ప్రభుత్వం నేతన్న సేవలో భాగంగా నేతన్నల లకు రూ.25 వేల ఆర్థిక సాయం.. 50 ఏళ్లు పైబడిన వారికి రూ.4 వేల ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందజేస్తున్నదన్నారు.నేతన్నల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతన్న సేవలో కార్యక్రమం ప్రారంభించారని కూటమి ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. 'నేతన్న సేవ' పథకం కింద ఒక్కో నేతన్నకు రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే 50 ఏళ్లు పైబడిన 85,678 మంది నేతన్నలకు నెలకు రూ.4 వేల చొప్పున ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందుతోందన్నారు. నేతన్నలకు ఉచిత విద్యుత్‌లో భాగంగా మగ్గానికి 200 యూనిట్లు, మరమగ్గానికి 500 యూనిట్ల వరకు విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. చేనేత కార్మికుల ఆర్థిక భరోసా, జీవనోపాధి మెరుగుదలే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చేనేత రంగ అభివృద్ధికి, నేతన్నల కుటుంబాల సంక్షేమానికి మరిన్ని చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.



## వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్సై నరేంద్ర.



**నందికొట్కూరు సెప్టెంబర్ 13( నంది పత్రిక)** వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, నిమజ్జన కార్యక్రమాల్లో కూడా శాంతిభద్రతలకు ఇబ్బంది కలిగించకుండా ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై నరేంద్ర వినాయక చవితి ఉత్సవ కమిటీ నిర్వాహకులకు తెలియజేశారు. ఆదివారం ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ ఆవరణ నందు ఎస్సై ఈ నరేంద్ర ఆధ్వర్యంలో వివిధ గ్రామాల వినాయక చవితి ఉత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వినాయక చవితి ఉత్సవాలు, ఊరేగింపు నిమజ్జన కార్యక్రమాల నిర్వాహన విధివిధానాలపై ఎస్సై వారికి అవగాహన కల్పించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాల జరుపుకొని ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా నిమజ్జన వేడుకలను జరుపుకోవాలని ఆయన వారికి విజ్ఞప్తి చేశారు. అలాకాకుండా చట్ట విరుద్ధ కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరంగా వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పాండవగల్లు కూటమి సర్పంచ్ అభ్యర్థి రేసులో స్వామి రామకృష్ణ

### ఒకసారి అవకాశం ఇస్తే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిత్త



**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** ఆదోని నియోజకవర్గం లోని పాండవుగల్ గ్రామ కూటమి అభ్యర్థి రేసులో స్వామి రామకృష్ణ ముందస్తు లో ఉన్నారు గ్రామ ప్రజలు ఒకసారి నాకు అవకాశం ఇస్తే మా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దతానని రామకృష్ణ అన్నారు అలాగే గ్రామంలో తాగునీటి సమస్య, సిసి రోడ్లు, మురికి కాలువలు, మరియు గ్రామ ప్రజలకు ఏమైనా సమస్యలున్న కూటమి ప్రభుత్వంపరంగా నేను ముందుండి గ్రామ సమస్యలను తీరుస్తానని అన్నారు అందుకోసం కూటమి ప్రభుత్వంలో ఉండే నాయకులు టిడిపి మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, కర్నూలు జిల్లా తెలుగుదేశం అధ్యక్షురాలు గుడిసెకృష్ణమ్మ, జనసేన ఆదోని ఇన్చార్జి మల్లప్ప వీళ్ళందరూ కలిసి పాండవుగల్ సర్పంచ్ అభ్యర్థిగా నన్ను ప్రకటిస్తే గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని రామకృష్ణ అన్నారు

## చదువుతో పాటు విలువలు నేర్పుతాం : ప్రిన్సిపల్ వెంకట రమణమ్మ.

- ఉజ్వల భవిష్యత్తుకు అంబేద్కర్ కళాశాలలు
- ప్రభుత్వ ఉద్యోగం వస్తే సమాజంలో గౌరవం
- గురువులను గౌరవించాలని తల్లిదండ్రులకు పిలుపు
- ప్రిన్సిపాల్ కు సీఎం చేతుల మీదుగా అవార్డు
- లక్ష్మాపురం గురుకుల పాఠశాల లో తల్లిదండ్రుల సమావేశం



**నందికొట్కూరు /పగిడ్యాల సెప్టెంబర్ 13( నంది పత్రిక)** విద్యార్థులకు డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల మరియు కళాశాలలో చదువుతో పాటు విలువలు నేర్పుతామని చిన్నటేకూరు బి.ఆర్ అంబేద్కర్ ఐఐటి, నీట్ అకాడమీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్, ఉమా మహేశ్వరప్ప ,మాజీ ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్ లు తల్లిదండ్రులకు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామ అంచె సమీపంలో ఉన్న డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం ప్రిన్సిపాల్ వెంకటరమణమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఐఐటి, నీట్ అకాడమీ కళాశాలలు ఒక వరము లాంటివని అన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ప్రభుత్వం ఉద్యోగం సంపాదిస్తే సమాజంలో మంచి గౌరవం లభిస్తుందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో విద్యార్థినీల పట్ల అంకితభావంతో పనిచేస్తూ 2025-26 సంవత్సరముగాను ఇంటర్మీడియట్ ,పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించినందుకు 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా అమరావతిలోని రాయపూడి పేరేడు మైదానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉత్తమ ప్రిన్సిపాల్ గా ప్రశంసా పత్రం అందుకోవడం జిల్లాలోని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలకే గర్వ కారణమని ప్రిన్సిపల్ వెంకట రమణమ్మ ను వారు అభినందించారు. విద్యా రంగంలో 34 ఏళ్లుగా ఎన్నో విశేష సేవలు అందించామని అంతేకాక విద్యార్థులకు క్రమశిక్షణ మరియు అంకితభావంతో ఉపాధ్యాయ బృందం చేత చిన్నటేకూరు బి.ఆర్ అంబేద్కర్ ఐఐటి, నీట్ అకాడమీ కళాశాలలో అద్భుత ఫలితాలు సాధించడంతో పాటు ఐఐటి, నీట్ లలో సీట్లు సాధించి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరియు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు అందుకోవడం జరుగుతుందని తెలిపారు . గురువులను గౌరవించాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉందని పిలుపునిచ్చారు. లక్ష్మాపురం గురుకుల కళాశాలలో చదివే విద్యార్థినీలు అందరూ కష్టపడి చదివి నీట్ మరియు ఐఐటీలలో సీట్లు సాధించాలని వారు పేర్కొన్నారు . అనంతరం ప్రిన్సిపాల్ వెంకటరమణమ్మ మరియు ఫిజిక్స్ లెక్చరర్ ఉమామహేశ్వరప్ప , మాజీ ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్ లను గురుకుల పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు తల్లిదండ్రులు చేతుల మీదుగా శాలువా కప్పి సన్మానించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయనీలు , తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది





### మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రమాదవశాత్తు మరణించిన ముగ్గురు కార్యకర్తల నామినీలకు రూ. 5 లక్షల చొప్పున ప్రమాద బీమా చెక్కుల పంపిణీ నంద్యాల క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేసిన మంత్రి ఫరూక్

**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 13 ( నంది పత్రిక )**

తెలుగుదేశం పార్టీ కోసం నిరంతరం శ్రమించిన కార్యకర్తలను, వారి కుటుంబాలను తెలుగుదేశం పార్టీ ఎన్నడూ మరువదని, అన్నివేళలా అండగా నిలుస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు . నంద్యాలలోని మంత్రిగారి క్యాంపు కార్యాలయం నందు ప్రమాదవశాత్తు మరణించిన పార్టీ కార్యకర్తల కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమ విభాగం ద్వారా మంజూరైన ప్రమాద బీమా చెక్కులను మంత్రి ఫరూక్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ టీడీపీ పార్టీని నమ్ముకుని అహర్నిశలు పనిచేసే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకోవడమే టీడీపీ ధ్యేయమన్నారు. అకాల మరణం చెందిన కార్యకర్తల లోటు పార్టీకి తీరనిదని, వారి కుటుంబాలు ఆత్మస్థైర్యంతో నిలబడేందుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గారి ప్రత్యేక చొరవతో ప్రమాద బీమా కింద రూ. 5 లక్షల ఆర్థిక సాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

బీమా చెక్కులు అందుకున్న బాధిత కుటుంబాల వివరాలు:.

1) దివంగత అక్కమ్మల్ల సివయ్య కుటుంబం

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 1 వ వార్డ్ (ఎ.చీశీ. 24-32) దివంగత కార్యకర్త అక్కమ్మల్ల సివయ్య గారి నామినీ అయిన వారి కుటుంబ సభ్యురాలు బంగారిగళ్ళ శాంతకుమారి గారికి రూ. 5,00,000/- (ఐదు లక్షల రూపాయల) బీమా చెక్కును అందజేశారు.

2) దివంగత బాల వెంకటరాహుల్ కుటుంబం

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 1 వ వార్డ్ (ఎ.చీశీ. 7-300) దివంగత కార్యకర్త బాల వెంకటరాహుల్ గారి నామినీ చంద్రకళ ఆవుల గారికి రూ. 5,00,000/- (ఐదు లక్షల రూపాయల) ప్రమాద బీమా చెక్కును అందజేశారు.

3)దివంగత మిట్నాల జగదీష్ కుమార్ కుటుంబం

నంద్యాల టౌన్ 17వ వార్డుకు చెందిన దివంగత కార్యకర్త మిట్నాల జగదీష్ కుమార్ గారి భార్య మిట్నాల మునీశ్వరి గారికి రూ. 5,00,000/- (ఐదు లక్షల రూపాయల) ప్రమాద బీమా చెక్కును అందజేశారు..

ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులతో పాటు టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి రామచంద్రరావు, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, నంద్యాల ఒకటో వార్డు మాజీ కౌన్సిలర్ నాగార్జున, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సుమలత, 17వ వార్డు టిడిపి ఇంచార్జి రామ్ మద్దయ్య మరియు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వినాయక చవితి సందర్భంగా కళ కళ లాడిన బేతంచెర్ల పాత బస్టాండ్ సెంటర్.

**బేతంచెర్ల సెప్టెంబర్ 13 ( నంది పత్రిక ).** బేతంచర్ల పట్టణం,పాత బస్ స్టాండ్ సెంటర్ ఏరియా,సంత మార్కెట్ అంతా ఆదివారం ప్రజలతో కిక్కిరిసి పోయింది.. జన సందోహంతో నిండి పోయింది. సోమవారం ప్రారంభం కానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని,ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజా సామాగ్రిని కొనుగోలు చేశారు. ఇంటి వద్ద పూజించే చిన్న,చిన్న సైజులతో,ఆకర్ష నీయమైన రంగులతో, మట్టి వినాయకుడు విగ్రహాలను,అధిక సంఖ్యలో ప్రజలు కొనుగోలు చేశారు. ఈ విధంగా కొనుగోలు చేయుటలో ప్రజలలో మార్పు కనిపించింది. చిన్న పెద్దా అనే తేడా లేకుండా, ఈ సంవత్సరం మట్టి విగ్రహాలను కొనుగోలు చేశారు. ఇంటి వద్ద మూడు రోజుల పాటు గణనాధుని పూజిస్థామని,చెట్లు పెంచు కోవడానికి కుండీలుగా ఈ మట్టిని ఉపయోగిస్తామని ప్రజలు తెలిపారు. ప్రభుత్వాలు సైతం మట్టితో తయారైన వినాయకుడి విగ్రహాలను పూజించాలని,పర్యావరణ పరిరక్షణ పై అధికారులు పెద్ద స్థాయిలో మట్టితో చేసిన వినాయకులను ఉపయోగించాలని కూడా,ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణములోని పాత బస్టాండ్ లో మట్టి వినాయకుని విగ్రహాలు,రక రకాల బంతి పూలు,పండ్లు,గరక,చెఱుకుగడలు ,మామిడాకులు,వెలక్కాయలు, అరటి పిలకలు తదితర గణపతి పూజా సామాగ్రిని, ప్రజలు భారీ సంఖ్యలో కొనుగోలు చేశారు.వినాయకుని పూజా సామాగ్రిని,కొనుగోలు చెసే వారితో, ఆ ప్రాంత మంతయూ కళ కళ లాడింది.మరో ప్రక్క యువకులు, ముసుగు వేసిన భారీ వినాయకుడి విగ్రహాలను లారీల మీదా, ట్రాక్టర్ల మీదా తీసుకు వచ్చి, వినాయక మండపాలు ఏర్పాటు చేసిన స్థలికి చేరుస్తూ,సంబరాలతో జై గణేశా,జై జై గణేశా అనే నినాదాలతో,బేతంచెర్ల పుర వీధులు మార్మోగాయి.మెయిన్ రోడ్, తదితర కూడళ్ళలో, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా, బేతంచెర్ల పోలీసులు తగు చర్యలు చేపట్టారు.





## సుల్తానాపురం కొండల్లో డ్రోన్ నిఘా.. సారా బట్టీ ధ్వంసం!



### 350 లీటర్ల బెల్లం ఊట, 75 లీటర్ల నాటుసారా స్వాధీనం. ఇద్దరిపై కేసు.. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసుల గాలింపు.

**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** కర్నూలు జిల్లా ఎస్పీ, ఆదోని డీఎస్పీ రాజశ్రీ ఆదేశాల మేరకు ఆదోని రూరల్ సర్కిల్ సీఐ సి. నల్లప్ప ఆధ్వర్యంలో పోలీసులు సుల్తానాపురం కొండల్లో డ్రోన్ కెమెరా సహాయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కొండ ప్రాంతంలో రహస్యంగా సారాయి బట్టీ ఏర్పాటు చేసి నాటుసారా తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం మేరకు ఎస్వీ ఎస్ఐ డి. మహేష్ కుమార్, సిబ్బందితో కలిసి సంబంధిత ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అక్రమంగా ఏర్పాటు చేసిన సారాయి బట్టీని పోలీసులు ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగిస్తున్న సుమారు 350 లీటర్ల బెల్లం ఊట, ఇతర సామగ్రిని ధ్వంసం చేయడంతో పాటు 75 లీటర్ల నాటుసారాను, ఒక మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల తనిఖీలను గమనించిన నిందితులు అక్కడి నుంచి పరారైనట్లు తెలిపారు. పరారీలో ఉన్న ఇద్దరినీ త్వరలోనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని పోలీసులు



పేర్కొన్నారు. అక్రమంగా నాటుసారా తయారు చేసి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. డ్రోన్ కెమెరాల సహాయంతో కొండ ప్రాంతాల్లోనూ నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



# వినాయక చవితి పర్యావరణహితం

## మట్టి గణపతులు పంఫిణీ చేసిన బీసి ఇందిరా రెడ్డి భక్తితో పూజిద్దాం.. ప్రకృతిని కాపాడుదాం మంత్రి సతీమణి



**బనగానపల్లె సెప్టెంబర్ 13నందిపత్రిక** వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు అందరం కృషి చేయాలని రాష్ట్ర మంత్రి బీసి జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి పిలుపునిచ్చారు. పర్యావరణహితంగా పండుగ వేడుకలు నిర్వహించాలనే సమున్నత ఆశయంతో ఆమె తమ స్వగ్రామమైన యనకండ్లలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన ఒక్క విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయకుండా, పూర్తిగా మట్టి విగ్రహాలతోనే పూజలు నిర్వహించేలా గ్రామం లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణి చేశారు.యనకండ్ల గ్రామానికి చెందిన యువత విజ్ఞప్తి మేరకు బీసీ ఇందిరా రెడ్డి తన సొంత నిధులతో 14 మట్టి గణనాథుల విగ్రహాలను పంపిణీ చేశారు. వినాయక చవితి సందర్భంగా మట్టి గణనాథులకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం వాటి నిమజ్జనాన్ని కూడా పర్యావరణహితంగా చేపట్టాలని సంకల్పించారు.యనకండ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రత్యేకంగా గుంతలు తవ్వించి, పూజల అనంతరం బుధవారం మట్టి విగ్రహాలను వాటిలోనే నిమజ్జనం చేయాలని నిర్ణయించారు. అనంతరం అదే గుంతల్లో పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో మొక్కలు నాటాలని సంకల్పించారు. దీంతో వినాయక చవితి వేడుకలకు భక్తితో పాటు ప్రకృతి పరిరక్షణను జోడించిన అరుదైన కార్యక్రమంగా నిలవాలన్నారు .

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌కు స్వస్తి.. మట్టి గణనాథులకే పెద్దపీట.. సాధారణంగా వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ఏర్పాటు చేయడం, అనంతరం వాటిని నీటిలో నిమజ్జనం చేయడం వల్ల జలవనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, ఆచరణలోనూ మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో బీసీ ఇందిరా రెడ్డి మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించారు. వినాయకుడిపై భక్తిని చాటుకోవడంతో పాటు ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యతను గుర్తు చేస్తూ బీసీ ఇందిరా రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం 'పండుగ జరుపుకుందాం.. ప్రకృతిని కాపాడుకుందాం' అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లింది. సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయవచ్చని ఈ కార్యక్రమం ద్వారా ఆమె చాటిచెప్పారు.

# ప్రజా దర్బార్‌లో మంత్రికీ వినతులు



**బనగానపల్లె సెప్టెంబర్ 13నందిపత్రిక** బనగానపల్లె లోని మంత్రి క్యాంపు కార్యాలయం లో ఆదివారం ప్రజల నుండి మంత్రి బీసి జనార్ధన్ రెడ్డి కి ప్రజా వినతులు వెల్లువెత్తాయి. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో ఆదివారం మంత్రి తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వినతులను మంత్రికి నేరుగా వివరించారు.ప్రజల నుంచి వినతులను స్వీకరించిన మంత్రి ప్రతి సమస్యను ఓపికగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేలా ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.కొత్తగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన పలువురికి స్వర్ణ సచివాలయం, స్వర్ణ వార్డు ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. పలు రెవెన్యూ సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపించడం తమ బాధ్యత అన్నారు . ప్రజల సంక్షేమమే ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యత అని, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.అనంతరం ఎమ్మిగనూరుకు చెందిన బాలబంధు గద్వాల సోమన్న రచించిన 'అమ్మ ప్రేమ', 'చిరుగాలి' బాల గేయాల పుస్తకాలను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆవిష్కరించారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజిద్దాం

## 3,000 మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ

## మట్టి వినాయకుడి నిమజ్జనం అనంతరం మొక్కను నాటాలి

## ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, సెప్టెంబరు 13(నంది పత్రిక):–** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నంద్యాల జిల్లా యంత్రాంగం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్తంగా జిల్లాలో 3,000 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ భవనం సమీపంలో ఉన్న రెవెన్యూ క్లినిక్ వద్ద ప్రజలకు జిల్లా కలెక్టర్ స్వయంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పాప్), రసాయన రంగులతో తయారు చేసే వినాయక విగ్రహాల నిమజ్జనం వల్ల నీటి వనరులు కలుషితమై పర్యావరణానికి హాని కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతగా వ్యవహరించి మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే పూజించాలని ఆమె పిలుపునిచ్చారు. మట్టి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రత్యేకంగా నీటి వనరులను వినియోగించాల్సిన అవసరం లేకుండా, ఇంటివద్దే ఒక పూలకుండీలో నిమజ్జనం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జనం పూర్తయిన అనంతరం అదే కుండీలో ఒక మొక్కను నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆమె కోరారు. గణేష్ మండపాల నిర్వాహకులు భద్రతా నిబంధనలు పాటించాలి జిల్లాలో గణేష్ మండపాల నిర్వాహకులు సంబంధిత అధికారులు, ఉత్సవ కమిటీలు జారీ చేసే సూచనలు, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ లైన్ల విషయంలో ప్రత్యేక అప్రమత్తత వహించాలని, విద్యుత్ తీగలను కర్రలతో నెట్టడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఏదైనా చిన్న సమస్య ఎదురైనా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. వినాయక చవితి పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా ఘనంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రజల సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ**

కాలుష్య నియంత్రణ మండలి అధికారి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి చేపడుతున్న చర్యలకు ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా ఉన్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, సాధ్యమైనంత వరకు ఇంటివద్దే మట్టి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, మెంబర్ సెక్రటరీల సూచనలు, ఆదేశాల మేరకు మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## ఆవుల పుల్లారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేసిన ఆవుల విజయభాస్కర్ రెడ్డి లతారెడ్డి దంపతులు



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 13 నంది పత్రిక:** పట్టణంలోని టీబి రోడ్డులో ఉన్న ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత మట్టి వినాయక విగ్రహాలను ప్రముఖ న్యాయవాది, విహెచ్పి అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్ రెడ్డి, ఆయన సతీమణి లతా రెడ్డి లు ఆదివారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి ఎటా పర్యావరణ హిత కరమైన ఉచిత మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గణేష్ కేంద్ర కమిటీ సభ్యులు గ్యాస్ పుల్లయ్య, నాగరాజు, రామాచారి, గొల్ల రమణయ్య, పోస్టల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## గోవులను సంరక్షించాలని నిరసన దీక్ష చేపట్టిన విద్యావేత్త సామాజిక కార్యకర్త జిల్లా జంతు సంరక్షణ బోర్డు ఉపాధ్యక్షులు ఈపనగండ్ల శ్రీనివాస్ యాదవ్



**,ఆళ్లగడ్డ: ప్రతినిధి సెప్టెంబర్ 13 నంది పత్రిక** గోవుల యజమానులు తమ గోవులను, బసవన్నలను లేగ దూడలను వీధులలో వదలకుండా ఇంటిదగ్గర సంరక్షించుకోవాలని కోరుతూ జిల్లా అనిమల్ బోర్డు ఉపాధ్యక్షులు, జంతు ప్రేమికుడు, బృందావనం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈపనగుండ్ల శ్రీనివాస యాదవ్ స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం వద్ద నిరసన దీక్ష కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవులను బసవన్నలను వాటి యజమానులు వీధులలో వదులుతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జంతువుల యజమానులకు వాటిని పోషించే స్తోమత లేనప్పుడు వాటిని ఇతరులకు దానం చేయడం లేదా గోశాలకు తరలించడం చేసేలా మున్సిపల్ అధికారులు గోవుల యజమానులకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే జరిమానా విధించాలన్నారు. బసవన్నలను వధించు కబేలాను వెంటనే మూసివేయాలన్నారు. గోపోషణ చేయలేని యజమానులు వాటిని రోడ్లపై విడిచి వేయడంతో అవి సినిమా వాల్ పోస్టర్లు, పాలిథిన్ కవర్లు తింటూ అనారోగ్యానికి గురవుతున్నాయన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల బారిన ప ప్రాణాలు కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు పోలీసు వారికి సమాచారం అందించిన సరైన చర్యలు చేపట్టకపోవడంతో నిరసన దీక్ష చేపడుతున్నానని ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.కాగా మూగ జంతువుల రక్షణ కోసం నిరసన దీక్ష చేస్తున్న డాక్టర్ శ్రీనివాసుల యాదవ్ కు న్యాయవాది గౌస్ తో పాటు పలువురు పుర ప్రముఖులు సంఘీభావం తెలిపారు.

# మట్టి విగ్రహం పంచభూతాలకు ప్రతీక

## జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మట్టి వినాయకులు పంపిణీ




**కర్నూలు సిటీ నందిపత్రిక** మట్టితో తయారుచేసిన వినాయకుని పూజించడం మన సాంప్రదాయం. ఆధ్యాత్మిక శాస్త్రీయ పర్యావరణ కారణాలు తెలిపేది. మట్టి వినాయక విగ్రహాలను పూజించడం వెనక ఆధ్యాత్మిక శాస్త్రీయ పర్యావరణ కారణాలు ఉన్నాయని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు మీసాల సుమలత తెలిపారు. డిసిసి అధ్యక్షులు బోయ క్రాంతి నాయుడు సూచన మేరకు ఆదివారం కర్నూలు నగరంలోనీ 48 వ వార్డు రోజా వీధిలో కాంగ్రెస్ పార్టీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత మాట్లాడుతూ భూమి నీరు అగ్ని వాయు ఆకాశం వంటి పంచభూతాలకు ప్రతీక అని అందుకే మట్టి గణపతిని పూజించడం ద్వారా మనము ప్రకృతిని విశ్వాసాన్ని పూజించినట్లు అవుతుందన్నారు. మట్టిలో పుట్టి మట్టిలోనే లీనమవడం అనే సృష్టి తత్వాన్ని వినాయక నిమజ్జనం తెలియజేస్తుందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నీటిలో కరగవని అనేక రోజులు అలాగే ఉండడం వల్ల నీటిని కలుషితం చేయడం వల్ల పర్యావరణాన్ని దెబ్బ తీస్తాయని, మట్టి విగ్రహాలు నీటిలో వేయగానే సహజంగా త్వరగా కరిగిపోతాయని చెప్పారు. రసాయన రంగులు వాడటం వల్ల నీటిలో చేపలతో పాటు ఇతర జలచరాల ప్రాణాలకు హాని కలిగిస్తాయని, మారుమూల ప్రాంతాలలో చెరువులలో మట్టి పూడిక తీయడం వల్ల నీటి నిలువ సామర్థ్యం పెరగవచ్చు మీసాల సుమలత తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారి చంద్రశేఖర్ శర్మ, వెంకటేష్, విశ్వదిరాం, నాగప్ప, నారాయణమ్మ బీసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమ గోదావరి జిల్లా ప్రజలకు, మీడియా మిత్రులకు మరియు పోలీసు కుటుంబాలకు వినాయక చవితి శుభాకాంక్షలు...

### జిల్లా ఎస్పీ శ్రీ అద్నాన్ నయీం అస్మి, ఐపీఎస్.గారు.



"విఘ్నాలు తొలిగి జిల్లా ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్ష"

"పర్యావరణ హితంగా మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దాం... శాంతియుతంగా వేడుకలు జరుపుకుందాం" రేపు ఘనంగా జరుపుకోనున్న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ శ్రీ అద్నాన్ నయీం అస్మి, ఐపీఎస్ గారు జిల్లా ప్రజలందరికీ, పోలీసు అధికారులకు, సిబ్బందికి మరియు మీడియా మిత్రులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విజ్ఞాన దాత, విఘ్నాధిపతి అయిన శ్రీ విఘ్నేశ్వరుని కృపతో జిల్లా ప్రజల జీవితాల్లోని అన్ని ఆటంకాలు తొలగిపోయి, విజయాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు పరిమళించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. భారతీయ సంస్కృతిలో వినాయక చవితి వేడుకలు ఐక్యతకు, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.ప్రజలందరూ ఈ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ గారు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించి, పర్యావరణహిత పద్ధతిలో వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు. పండుగ వేళ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను, మార్గదర్శకాలను విధిగా పాటించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించడం, సౌండ్ సిస్టమ్స్‌ను పరిమిత శబ్దాలతో వినియోగించడం మరియు ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసే బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి అప్రమత్తతతో ఉందని, ఎప్పటికప్పుడు తగిన భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టడం జరిగిందని ఎస్పీ గారు తెలిపారు. మండపాల నిర్వాహకులు ఎటువంటి మతపరమైన సంఘర్షణలకు, శాంతిభద్రతల సమస్యలకు తావివ్వకుండా సహకరించాలని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినా లేదా అవాంఛనీయ సంఘటన జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం తెలిసినా, వెంటనే స్థానిక పోలీసు అధికారులకు లేదా ఎమర్జెన్సీ నంబర్ 112కు సమాచారం అందించి పోలీసు విధులకు సహకరించాలని జిల్లా ప్రజలను కోరారు. వినాయకుని ఆశీస్సులతో జిల్లాలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, అభివృద్ధిలో ముందడుగు వేయాలని ఎస్పీ శ్రీ అద్నాన్ నయీం అస్మి గారు మరోసారి ఆకాంక్షించారు.

## వాడవాడల కొలువైన గణనాథులు.

**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 13 (నంది పత్రిక):** మండలంలోని ఆయా గ్రామాలలో వాడవాడల గణనాథలు కొలువయ్యారు. రుద్రవరం మండలంలోని పలు గ్రామాలలో ఇప్పటివరకు 108 మండపాలలో విగ్రహాలను ఏర్పాటు చేసుకునేందుకు పోలీస్ స్టేషన్లో దరఖాస్తు చేసుకున్నట్లు ఎస్సై జయప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని మూడు రోజుల తర్వాత నిమజ్జనం చేయాలన్నారు. ఉత్సవాల సందర్భంగా పోలీసు అధికారులు సూచించిన విధంగా నియమ నిబంధనలు పాటించాలన్నారు. వినాయక విగ్రహాలను పట్టణాల నుంచి ఆయా గ్రామాల యువకులు ఉత్సాహంగా ట్రాక్టర్లు ఆటోలు ద్వారా వారి గ్రామాలకు తరలించి మండపాలలో కొలువుదీర్చారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

నంది పత్రిక
సోమవారం 14 - 09 -2026

## కీసర గ్రామశీ మామిడి తోటల్లో అక్రమంగా దాచిన రేషన్ బియ్యం నిల్వ లపై రెవెన్యూ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు



28 క్వింటాళ్ల అక్రమ నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు షేక్ ఖాజా రెహముద్దీన్ అనే వ్యక్తి ఈ రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లుగా రెవెన్యూ అధికారుల విచారణలో బయటపడింది రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కీసర గ్రామంలోరేషన్ షాప్ కు అప్పగిం చారు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు

## జాతీయ లోక్ అదాలత్‌లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 4,268 కేసుల పరిష్కారం - సీపీ గౌష్ ఆలం.

**కరీంనగర్, సెప్టెంబర్ 13, 2026:** జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను వేగవంతంగా పరిష్కరించేందుకు చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. 12 సెప్టెంబర్ 2026న జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 4,268 కేసులు పరిష్కరించబడ్డాయి. జాతీయ లోక్ అదాలత్‌కు ముందు నిర్వహించిన ప్రీ-నేషనల్ లోక్ అదాలత్ ప్రక్రియలో 374 కేసులు, 12.09.2026న జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 77 ఖీ×= కేసులు పరిష్కరించబడ్డాయి. దీంతో మొత్తం 451 ఖీ×= కేసులు పరిష్కారమయ్యాయి.అదేవిధంగా, వాహన ప్రమాదాలు/ఇతర సంబంధిత కేసులకు సంబంధించిన 1,019 కేసులు, మోటార్ వెహికల్ కేసులు 2,798 పరిష్కరించబడ్డాయి. మొత్తంగా 4,268 కేసులకు పరిష్కారం లభించింది.

**పోలీస్ స్టేషన్ల పనితీరులో టాప్5**

కేసుల పరిష్కారంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీస్ స్టేషన్లలో:

1. కరీంనగర్ ట్రాఫిక్ 685 కేసులు 2. కరీంనగర్× టౌన్ 495 కేసులు

3. కరీంనగర్×× టౌన్ 344 కేసులు 4. కరీంనగర్××× టౌన్ 275 కేసులు

5. కరీంనగర్ రూరల్ 246 కేసులు కాగా, తక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారం జరిగిన పోలీస్ స్టేషన్లలో కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్ 17, సైదాపూర్ 76, వీణవంక 105, గన్నేరువరం 121, గంగాధర 131 కేసులతో ఉన్నాయి.

**సైబర్ నేరాల కేసుల పరిష్కారం** జాతీయ లోక్ అదాలత్ ప్రక్రియలో సైబర్ క్రైమ్‌కు సంబంధించిన 29 ఖీ×= కేసులు, 5 నాన్-ఖీ×= కేసులు కూడా పరిష్కరించబడ్డాయి. జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి సహకరించిన న్యాయ వ్యవస్థ, పోలీస్ అధికారులు, సిబ్బందికి కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ అభినందనలు తెలిపింది. కేసులను సకాలంలో పరిష్కరించేందుకు పోలీస్ శాఖ తరఫున నిరంతరం సమన్వయంతో చర్యలు కొనసాగుతాయని సీపీ గౌష్ ఆలం తెలిపారు.

## కడప జిల్లా సిదవటం బ్రిడ్జిపై మెనీ లారీ ద్విచక్ర వాహనం డి...



ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇరువురు కి తీవ్ర గాయాలు..బద్వేల్ నుండి కడపకు వస్తున్న మెనీ లారీని ఢీ కొన్న ద్విచక్ర వాహనదారులు...ద్విచక్రంలో ప్రయాణిస్తున్న ఇరువురిలో ఒకర పరిస్థితి విషమం..చికిత్స నిమిత్తం కడప రిమ్స్ తరలింపు... విషయం తెలుసుకున్న సిద్ధవటం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు.

## కృష్ణా జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు జిల్లా ఎస్పీ శ్రీ వి.విద్యాసాగర్ నాయుడు, ఐ.పి.ఎస్.,

వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, మతసామరస్యం, సోదరభావం మరియు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీ వి.విద్యాసాగర్ నాయుడు, ఐ.పి.ఎస్. గారు ఆకాంక్షించారు.పండుగ సందర్భంగా ప్రభుత్వ నిబంధనలు, పోలీసు శాఖ సూచనలు పాటిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వేడుకలను నిర్వహించుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కృష్ణా జిల్లా ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సకల శుభాలు కలగాలని ఆకాంక్షిస్తూ జిల్లా పోలీసు శాఖ తరఫున వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

## చెన్నూరు మండలం శేషయ్య గారి పల్లి ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం.



కడప టౌన్ లోహియా నగర్ కు చెందిన, గంగవరం నరసింహులు 18,మాలికా మణి 15 అక్కడికక్కడే మృతి. బస్ టైర్ తల మీద ఎక్కడం తో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.మనోహర్ 20 కు గాయాలు కాగా కడప రిమ్స్ కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కలువ పువ్వుల కోసం చెరువులోకి దిగి వ్యక్తి మృతి

కలువ పువ్వులు కోసేందుకు చెరువులోకి దిగిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన విషాద ఘటన భీమడోలు మండలం పరిధిలో చోటుచేసుకుంది.

స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... భీమడోలు మండలం అన్నే వారి గూడెం చెందిన పి. రాఘువులు (35) అనే వ్యక్తి ఆదివారం స్థానిక చెరువులో కలువ పువ్వులు కోసేందుకు దిగాడు. ఈ క్రమంలో చెరువు లోతు అంచనా వేయలేక, నీటిలో చిక్కుకుపోయి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి చెరువులో గాలించి బయటకు తీసేలోపే రాఘువులు మృతి చెందినట్లు గుర్తించారు.

## సిరివెళ్ల వచ్చాడండి వినాయకుడు...

**సిరివెళ్ల(నంది పత్రిక)** సిరివెళ్ల మండలంలో వినాయక చవితి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే పోలీసులు ఆదేశాలు తీసుకొని నిర్వాహకులు వినాయక మండపాలను ఏర్పాటు చేసుకునే పనిలో ఫుల్ బిజీగా మారారు. మరోవైపు ఇప్పటికే కొన్ని విగ్రహాలు మండపాలకు చేరుకున్నాయి మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అధికారుల ఆదేశానుసారం భక్తులు కూడా జాగ్రత్తలు పాటిస్తున్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా కృషి చేయాలి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గంలోని అర్హత కలిగిన ఏ ఒక్కరూ పెన్షన్‌కు దూరం కాకుండా ప్రతి గ్రామం, ప్రతి బూత్ స్థాయిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారికి పెన్షన్ కోసం దరఖాస్తు చేయించేలా చర్యలు చేపట్టాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సూచించారు.ఈ మేరకు ప్రతి బూత్ యూనిట్, క్లస్టర్ ఇంచార్జిలకు ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని, పెన్షన్‌కు అర్హత ఉన్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితరులను గుర్తించి దరఖాస్తు ప్రక్రియలో వారికి సహకరించాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి స్పష్టం చేశారు.

## కర్నూలు నగరంలోని కోల్స్ సెంటినియల్ తెలుగు బాప్టిస్ట్ చర్చ్ యొక్క 108వ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీమంత్రి కేఈ ప్రభాకర్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలోని కోల్స్ చర్చ్ ఏర్పడి 108 వసంతాలు కావడంతో, వార్షికోత్సవ వేడుకలు మూడు రోజులు ఘనంగా జరిగాయి. చివరి రోజు ఆదివారము కోల్స్ సంఘానికి సంబంధించిన సభ్యులు క్రైస్తవులు భారీగా హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాయకులు కె. ఇ. ప్రభాకర్ సంఘాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ నగరంలోని క్రైస్తవులతో తమ కుటుంబానికి చాలా సంవత్సరాలుగా ఎంతో అనుబంధం ఉందని, క్రైస్తవులకు సహాయ సహకారాలు అందించుటకు తమ కుటుంబం ఎప్పటికీ ముందుంటుందని తెలిపారు. అప్పుడప్పుడు సంఘంలో గ్రూపు తగాదాలు జరిగిన సమయాల్లో కూడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలను వెంటనే పరిష్కారం చేసే వారమని అన్నారు. గత కొద్ది సంవత్సరాల కింద తమ చెంతకు చేరిన రాకుడ్ సంస్థకు చెందిన ఆస్తిని కూడా తిరిగి మేము అదే సంస్థకు రిజిస్టర్ చేసి ఇచ్చామని తెలిపారు. అంతేగాక క్రైస్తవ ఆస్తుల పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు నగరంలోనే 'పెద్ద చర్చి' గా పేరుగాంచిన కోల్స్ చర్చి 108 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం గర్వించదగ్గ విషయం అని, తమ సోదరుడు మాజీ డిప్యూటీ సీఎం కె. ఇ. కృష్ణమూర్తి తాను కోల్స్ కాలేజీ లోనే చదువుకొని ఆశీర్వదించబడ్డామని అన్నారు. స్టాండింగ్ కమిటీ వారికి సంగానికి క్రైస్తవులకు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చర్చ్ ప్రెసిడెంట్ అయిన సాల్మన్ మరియు జనరల్ సెక్రెటరీ అనిల్ నాథ్ ఇతర కమిటీ సభ్యులు ముఖ్యఅతిథిగా హాజరైనటువంటి కె. ఇ. ప్రభాకర్ ని ఘణంగా సన్మానించారు.



## జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 13 నంది పత్రిక**వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రజలంతా మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని, రసాయన రంగులు లేని విగ్రహాలను వినియోగించి ప్రకృతిని కాపాడాలని సూచించారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో, పరస్పర సోదరభావంతో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌కు విరామం

### వినాయక చవితి సందర్భంగా ప్రభుత్వ సెలవు - జిల్లా ప్రజలు గమనించాలి

**నంద్యాల బ్యూరో , సెప్టెంబర్ 13(నంది పత్రిక):-** వినాయక చవితి పండుగ సందర్భంగా సెప్టెంబర్ 14వ తేదీ సోమవారం ప్రభుత్వ సెలవు దినంగా ఉన్నందున నంద్యాల కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించబడవని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, అర్జీలు సమర్పించేందుకు సెప్టెంబర్ 14న కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ సూచించారు.

## విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలి

### జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎస్పీ



**నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 13(నంది పత్రిక):-** వినాయక చవితి పర్వదినాన్ని జిల్లా ప్రజలందరూ కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, రాష్ట్ర రోడ్లు-భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు సైతం జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విఘ్నేశ్వరుని అనుగ్రహంతో ప్రతి ఇల్లు సుఖసంతోషాలు, సౌభాగ్యాలతో కళకళలాడాలని, ప్రజల జీవితాల్లోని విఘ్నాలన్నీ తొలగిపోయి ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, ఆనందంతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సమర్ధవంతంగా అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమాలు మరింత ఫలవంతం కావాలని వారు ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో, ఆనందోత్సాహాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ జరుపుకోవాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయక విగ్రహాలను వినియోగిస్తూ పండుగను పర్యావరణహితంగా నిర్వహించడం ద్వారా ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## చెరువులకు చేరని చుక్క నీరు.

### ఆందోళనలో ఆయా గ్రామాల రైతులు ప్రజలు.



**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 13 (నంది పత్రిక):** తెలుగంగ ప్రధాన కాలువ ద్వారా త్రాగునీటి అవసరాలకు వదిలిన నీరు రుద్రవరం మండలంలోని కొన్ని చెరువుల్లోకి చుక్క నీరు కూడా చేరకపోవడంతో ఆయా గ్రామాల రైతులు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రుద్రవరం మండలంలో 16 చెరువులు 17 కుంటలు ఉన్నాయి. వీటి కింద దాదాపు 30 గ్రామాల ప్రజలు త్రాగునీటి అవసరాల కోసం నీటిని వినియోగించుకుంటున్నారు. మండలంలోని పెద్దరాజు చెరువు, పేరూరు, చందలూరు, మాచినేనిపల్లి, చిన్న కంబలూరు, పెద్ద కంబలూరు, బి నాగిరెడ్డిపల్లె చెరువు, వెం గన్న పల్లి చెరువు, బయన్నపల్లి చెరువు లకు కొన్ని కుంటలకు మీరు చేరకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెరువులకు నీరు నిండితే వ్యవసాయ బోరుబావులు భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగపడతాయని, అలాగే త్రాగునీటి అవసరాలకు ఉపయోగపడతాయని ఆయా గ్రామాలప్రజలు భావించారు. అయితే ఇప్పటికి తెలుగుగంగ ప్రధాన కాలువ ద్వారా వారం రోజుల నుంచి నీరు పారుతున్న చెరువులోకి మాత్రం చుక్క నీరు రాకపోవడంతో ఆయాగ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగా అధికారులు మాత్రము అన్ని చెరువులకు నీరు నింపామని చెబుతున్నారే తప్ప నీరు మాత్రము చెరువులకు రావడం లేదని అధికారులు స్పందించి వెంటనే చెరువులు కుంటలకు నీరు నింపాలని రైతులు ప్రజలు కోరుతున్నారు.

## కోల్స్ ఆకర్మన్ దొర కు నివాళులు అర్పించిన జీసస్ సోల్జర్ మినిస్ట్రీస్, సీసీ సంఘ నాయకులు



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూల్ నగరంలోని కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి 108 వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ మరియు సిసి సంఘ సభ్యుల ఆధ్వర్యంలో కోల్స్ అకర్మన్ దొర విగ్రహానికి నివాళులు అర్పించిన రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ డి.జగదీష్ గుప్తా మరియు మినిస్ట్రీస్ ప్రెసిడెంట్ జి.రవికుమార్ లు.. వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిశీచారు, ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. అమెరికన్ బాప్టిస్ట్ మిషనరీ ద్వారా కర్నూల్ నగరంలో క్రైస్తవుల కొరకు చర్చి మరియు విద్యా సేవల కొరకు కోల్స్ జూనియర్ కాలేజ్, ఎస్ టి బి సి కాలేజ్ , ఇ సి ఎమ్ స్కూల్స్ స్థాపించారని, అలాగే 50 ఎకరాల స్థలం కొని సమాజానికి ఇచ్చారని మరియు వారి స్నేహితుడు విలియం అర్థర్ స్టాంటన్ దొర ద్వార కర్నూలు నగరంలో ఈ సంస్థలను చర్చిలను నిర్మించారని తెలిపారు. నిరంతరం కర్నూల్ ప్రజలు స్మరించుకుంటూ ఉంటారని అన్నారు..ఈ సందర్భంగా ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు , కార్యక్రమంలో సెక్రటరీ ఆర్.ప్రసాదరావు, ఎస్ ఎన్. నాగరాజు, పి. పుష్పరాజు, బి.శ్రీరాములు, టిడిపి నాయకులు కె.ఏసన్న, పాస్టర్ రాజేష్, పాస్టర్ సామెల్, మినిస్ట్రీ సభ్యులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్14 సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమం తాత్కాలికంగా రద్దు

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 13** జిల్లా కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సెప్టెంబర్ 14 వతేదీ సోమవారం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నేడు ఒక ప్రకటనలో తెలిపారు.14వతేది సోమవారం వినాయకచవితి పండుగ సందర్భంగా జిల్లా, డివిజన్ మరియు మండల స్థాయిలలో నిర్వ హించే పీ.జీ.ఆర్. ఎస్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహ కరించాలని కలెక్టర్ కోరారు.



# ఎల్-నినోను ఎదుర్కొనేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు

**- తేమ ఒత్తిడిలో ఉన్న ప్రతి పంటను కాపాడాలి.. అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరునూ వినియోగించాలి**

**- రైతులకు అండగా ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

**- 284 మండలాల్లో పంటల పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ**

**- 2.44 లక్షల హెక్టార్లలో పంటలపై ప్రభావం.. రక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి**

**- పంట ఆరోగ్య వివరాల నమోదులో పెండింగ్‌ను వేగంగా పూర్తి చేయాలి**

**- ప్రత్యామ్నాయ, తక్కువ నీటి అవసరమయ్యే పంటలను పెద్దఎత్తున ప్రోత్సహించాలి**

**- వ్యవసాయ, జలవనరుల శాఖలు సమన్వయంతో పనిచేయాలి: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 13 నంది పత్రిక:** రాష్ట్రంలో ఎల్-నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని, తేమ ఒత్తిడికి గురవుతున్న పంటలను కాపాడేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్-నినో పరిస్థితులు, వర్షపాతం, ఖరీఫ్ సాగు, పంటలపై ప్రభావం, పంట ఆరోగ్య పరిస్థితి, ప్రత్యామ్నాయ పంటల సాగు, అందుబాటులో ఉన్న నీటి వనరులతో పంటలను కాపాడేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆదివారం మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తేమ ఒత్తిడికి గురైన ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరునూ సద్వినియోగం చేసుకుని పంటలను కాపాడేందుకు రక్షక తడులు అందించాలని వ్యవసాయ, జలవనరుల శాఖల అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, అవసరమైన చోట తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్రంలో జూన్ 1 నుంచి సెప్టెంబర్ 12 వరకు సాధారణంగా 476.1 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 218.2 మి.మీ. మాత్రమే నమోదైందని అధికారులు మంత్రికి వివరించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 54.2 శాతం వర్షపాతం లోటు నమోదైందన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వర్షాభావ ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు.ఖరీఫ్-2026లో సెప్టెంబర్ 12 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 26.50 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయని అధికారులు తెలిపారు. ఇది సాధారణ సాగు విస్తీర్ణంలో 74 శాతం కాగా, గత ఏడాది ఇదే తేదీ నాటి సాగుతో పోలిస్తే 78 శాతంగా ఉందన్నారు. ప్రధాన పంటల్లో వరి 12.01 లక్షల హెక్టార్లు, పత్తి 4.11 లక్షల హెక్టార్లు, కంది 2.63 లక్షల హెక్టార్లు, వేరుశనగ 1.47 లక్షల హెక్టార్లు, మొక్కజొన్న 1.08 లక్షల హెక్టార్లలో సాగైనట్లు వివరించారు.ఎల్-నినో ప్రభావంతో రాష్ట్రంలోని 284 మండలాలు, 1,792 ఆర్ఎస్‌కేలు/గ్రామాల పరిధిలో పంటలపై ప్రభావం నమోదైనట్లు సమావేశంలో అధికారులు వెల్లడించారు. మొత్తం 2,44,443 హెక్టార్లలో పంటలు వివిధ స్థాయిల్లో ప్రభావితమైనట్లు తెలిపారు. ఇందులో 1,92,387 హెక్టార్లలో తేమ ఒత్తిడి, 41,474 హెక్టార్లలో పంటలు వాడిపోవడం, మరో 10,582 హెక్టార్లలో పంటలు ఎండిపోవడం నమోదైనట్లు వివరించారు.

ఈ పరిస్థితిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ తేమ ఒత్తిడిలో ఉన్న పంటలను సాధ్యమైనంత వరకు కాపాడటమే ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు ఎప్పటికప్పుడు అందించాలని, అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు.

జిల్లాల వారీగా కర్నూలు జిల్లాలో అత్యధికంగా 1,09,255 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 80,751 హెక్టార్లు, అనంతపురం జిల్లాలో 32,456 హెక్టార్లలో పంటలు ప్రభావితమైనట్లు అధికారులు తెలిపారు. ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో వ్యవసాయ, జలవనరుల శాఖల అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని మంత్రి ఆదేశించారు. పంటల వారీగా కంది 74,301 హెక్టార్లు, పత్తి 73,733 హెక్టార్లు, వేరుశనగ 25,818 హెక్టార్లు, మొక్కజొన్న 24,819 హెక్టార్లు, వరి 18,443 హెక్టార్లలో ప్రభావితమైనట్లు సమావేశంలో వివరించారు.

**99.76 శాతం ప్లాట్ల సర్వే పూర్తి** ఈ-పంట, వీ&జు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2.7558 కోట్ల ప్లాట్లలో 2.7493 కోట్ల ప్లాట్ల సర్వే పూర్తయిందని, తద్వారా 99.76 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. కేవలం 65,233 ప్లాట్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మిగిలిన సర్వేను కూడా త్వరితగతిన పూర్తి చేసి క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. పంట ఆరోగ్య వివరాలకు సంబంధించి 1.082 కోట్ల ప్లాట్లలో వివరాలు నవీకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు 98.10 లక్షల ప్లాట్లలో నవీకరణ పూర్తయిందని అధికారులు వివరించారు. ఇంకా 10.10 లక్షల ప్లాట్లు, అంటే 9.34 శాతం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ పంట ఆరోగ్య వివరాల నమోదు కేవలం గణాంకాల కోసం కాకుండా, ఏ ప్రాంతంలో



ఏ పంటకు ఎలాంటి సమస్య ఉందో గుర్తించి సకాలంలో రైతుకు సహాయం అందించేందుకు అత్యంత కీలకమన్నారు. ప్రతి ప్లాట్‌లో పంట ఆరోగ్యాన్ని పర్యవేక్షించి, పెండింగ్‌లో ఉన్న వివరాల నవీకరణను వేగంగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఇప్పటివరకు 34,567 హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు చేపట్టినట్లు అధికారులు వివరించగా, ఇంకా 95,112 హెక్టార్లను కవర్ చేయాల్సి ఉందన్నారు. తక్కువ నీటి అవసరమయ్యే, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను తట్టుకునే పంటలను గుర్తించి రైతులను ప్రోత్సహించాలని మంత్రి ఆదేశించారు. రైతులకు విత్తనాలు, సాంకేతిక సలహాలు సహా అవసరమైన సహకారం అందుబాటులో ఉంచాలని సూచించారు.

**వ్యవసాయజలవనరుల శాఖల మధ్య నిరంతర సమన్వయం**

తేమ ఒత్తిడికి గురైన పంటలకు అందుబాటులో ఉన్న నీటి వనరులను వినియోగించి రక్షక తడులు అందించడంపై వ్యవసాయ, జలవనరుల శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఏ ప్రాంతంలో పంటకు నీరు అత్యవసరమో గుర్తించాలి. అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యతా క్రమంలో వినియోగించాలి. సాధ్యమైన ప్రతి పంటను కాపాడాలి. రైతుకు ప్రభుత్వం అండగా ఉందనే భరోసా క్షేత్రస్థాయిలో కనిపించాలి అని మంత్రి స్పష్టం చేశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల కింద సాగు చేసే రైతులు వరికాకుండా ఆరుతడి పంటలను పండించాలని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఎల్-నినో పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగాలని అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం చేశారు.

ఈ ఉన్నతస్థాయి సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వ్యవసాయసహకార శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రాజుని కుమారి, మత్స్య శాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్, జలవనరుల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్, జలవనరుల శాఖ కార్యదర్శి, ఐఏఎస్ రాజమౌళి, వ్యవసాయ, జలవనరుల శాఖలకు చెందిన వివిధ విభాగాధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కొయ్యలగూడెం అభివృద్ధికి కృషి చేస్తా

### నేవీ డిపో ఏర్పాటుకు సీఎం, లోకేష్‌తో చర్చిస్తా ఉంఎపీ పుట్టా మహేష్



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 13 నంది పత్రిక** కొయ్యలగూడెం ప్రాంత అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఆదివారం ఏలూరు క్యాంపు కార్యాలయంలో కొయ్యలగూడెం రైతులు, నేతలు ఆయనను కలిసి నేవీ ఆయుధ డిపోను అక్కడే ఏర్పాటు చేయాలని కోరారు. 90 శాతం మంది రైతులు అనుకూలంగా ఉన్నారని వివరించారు. స్పందించిన ఎంపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌తో చర్చించి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ఫైర్‌స్టేషన్‌తో పాటు రోడ్లు, డ్రైనేజీలు, స్మశానవాటికల అభివృద్ధిపైనా దృష్టి పెడతానన్నారు.

**అదనపు పొగాకు కొనుగోళ్లకు అనుమతి ఇప్పించేందుకు కృషి :**

**కేంద్రంతో మాట్లాడతా :** అదనంగా పండిన పొగాకు కొనుగోళ్లకు అనుమతి ఇప్పించేందుకు కేంద్రం, పొగాకు బోర్డుతో మాట్లాడతానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరులో ఆయనను కలిసిన పొగాకు రైతులు అదనపు కోటా, డి ఏ పి యూరియా ప్రత్యేక కోటా కల్పించాలని కోరారు. ప్రస్తుతం పొగాకు ధర కిలో రూ.345 వరకు చేరిందని రైతులు తెలిపారు. ధరలు మరింత మెరుగుపడేలా బోర్డు, కంపెనీలతో చర్చిస్తున్నానని ఎంపీ చెప్పారు. డి ఏ పి, యూరియా సమస్యపై వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడుతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

## మావుళ్లమ్మకు వెండి పాలవెల్లి విరాళం

### విఘ్నేశ్వరుడికి వెండి కానుక

### కేజీకి పైగా వెండి పాలవెల్లి సమర్పణ

### రూ.2.50 లక్షల విలువైన వెండి కానుక



**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 13 నంది పత్రిక** భీమవరం పట్టణంలోని ప్రముఖ ఇలవేల్పు, ఆరాధ్యదైవం శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి ఉపాలయంలో కొలువైన శ్రీ విఘ్నేశ్వర స్వామివారికి భక్తిశ్రద్ధలతో వెండి పాలవెల్లిని విరాళంగా సమర్పించారు. భీమవరానికి చెందిన గిన్నీ రామకుమారి సుమారు రూ.2.50 లక్షల విలువైన 1,037 గ్రాముల (కేజీ 37 గ్రాములు) వెండి పాలవెల్లిని ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ఆశీర్వచనం నిర్వహించారు. భక్తురాలు సమర్పించిన వెండి పాలవెల్లికి పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందజేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, ఆలయ చైర్మన్ బొండాడ నాగభూషణంతో పాటు ధర్మకర్తలు రామాయణం శ్రీనివాస్, ఉదిశి మీనాక్షి, మల్లువలస లక్ష్మి నిర్మల, గొంతెన రమణ, యండా సత్యవతి, ఇందుకూరి సుబ్రహ్మణ్యం రాజు, పాపోలు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం దాత గిన్నీ రామకుమారిని ఆలయ కమిటీ తరపున సత్కరించి, శేషవస్త్రం, ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భక్తులు స్వచ్ఛందంగా అందిస్తున్న విరాళాలు అభినందనీయమని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. విఘ్నేశ్వర స్వామివారికి వెండి పాలవెల్లి సమర్పించడం ద్వారా భక్తురాలు తన భక్తిని చాటుకున్నారని తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి: ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 13 నంది పత్రిక** రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మరియు రంపచోడవరం ఎమ్మెల్యే ఆదివారం రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించిన ఎమ్మెల్యే సంబంధిత సమస్యలను పరిశీలించి అధికారులతో సమన్వయం చేసుకుని వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేసేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తెలిపారు.అనంతరం వట్టిగెడ్డ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పార్టీ శ్రేణులకు సూచించారు.



## జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

### అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతిని ఆకాంక్షించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని ఆశీస్సులతో జిల్లా ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వినాయక చవితిని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని పర్యావరణహిత వినాయక ప్రతిమలను పూజించాలని కలెక్టర్ కోరారు. గణనాథుని ఆశీస్సులతో ఎన్టీఆర్ జిల్లా మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరికీ సుఖశాంతులు, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు. (సమాచార, పౌర సంబంధాల శాఖ, ఎన్టీఆర్ జిల్లా ద్వారా జారీ)

## వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు



**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 13 నంది పత్రిక** నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డిసిపి షేక్ షరీన్ బేగం సూచనతో లా అండ్ ఆర్డర్ వెస్ట్ ఎసిపి దుర్గారావు వన్ ట్రాఫిక్ సెక్టర్ 1 ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర మరియు వన్టౌన్ సిఐ గుణారామ్ తో కలిసి రేపు జరగనున్న వినాయక చవితి పండుగ సందర్భంగా ముందస్తు చర్యలలో భాగంగా కాలేశ్వర రావు మార్కెట్ దగ్గర వినాయక చవితి పండుగకు సంబంధించి వివిధ రకాలైన వస్తువులు, పత్రి, వినాయకుడి విగ్రహాలు కొనుగోలుకు అధిక సంఖ్యలో వస్తారని ముందస్తుగా ట్రాఫిక్ మరియు లాండ్ ఆర్డర్ బందోబస్తు ఏర్పాటు చేయడమైనది. మరియు పూల మార్కెట్ దగ్గర పండగ సందర్భంగా పూలు కొనుగోలు చేయుటకు వచ్చే కొనుగోలుదారులు పూల మార్కెట్ లోపలికి పంపించకుండా వియంసి పార్కింగ్లో ఒక క్రమబద్ధం ప్రకారం పార్కింగ్ పెట్టించి, అక్కడ ఎటువంటి ట్రాఫిక్ జామ్ కాకుండా బందోబస్తు నిర్వహించినారు. కాలేశ్వర రావు మార్కెట్ నందు వివిధ రకాలైన పత్రి, చిన్నచిన్న వినాయకుడి విగ్రహాలు అమ్మే దుకాణదారులను సాధారణ ట్రాఫిక్ కి, పాదాచారులకు అంతరాయం కలిగించకుండా లోపలికి జరిపించి ముందస్తు తగిన చర్యలు తీసుకున్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్ఎస్ఐ శ్రీధర్ మరియు సిబ్బంది ఆర్డర్ మహిళా ఎస్సై భాగ్యశ్రీ , ఇందిరా మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో నలుగురు మృతిపై సీఎం చంద్రబాబు విచారం

**అమరావతి, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 13 నంది పత్రిక :-** పిడుగుపాటుకు గురై పల్నాడు జిల్లాలో నలుగురు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం, మోపిరివారిపాలెం, కాకాని శివారు లక్ష్మీపురం, పాలపాడు గ్రామాలకు చెందిన తలపనేని నాగమ్మ, మజ్జిగ చిన్న కోటేశ్వరరావు, మేకల వెంకాయమ్మ, దేరంగుల వెంకటయ్య అనే నలుగురు పిడుగులు పడి మృతిచెందడం బాధాకరమన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన సీఎం... బాధిత కుటుంబాలకు తన ప్రగాఢసానుభూతి ప్రకటించారు. పండుగపూట నాలుగు కుటుంబాల్లో విషాధం నెలకొనడం బాధాకరమని అన్నారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



## నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

### వెబ్ డెవలపర్, టూ వీలర్ మెకానిక్ కోర్సుల్లో శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ.



**విజయవాడ: బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 13 నంది పత్రిక** నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద ఉచిత శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల, రమేష్ హాస్పిటల్ ఎదురు ఉన్న స్కిల్ హబ్‌లో ఇంటర్మీడియేట్, డిప్లొమా లేదా ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులకు వెబ్ డెవలపర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచిత శిక్షణను ఉపాధి కల్పన అధికారి సి.మధుభూషణ్ రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు పర్యవేక్షణలో అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 10వ తరగతి, ఐటిఐ డిప్లొమా లేదా ఇంటర్మీడియేట్ పూర్తి చేసిన అభ్యర్థులకు టూ వీలర్ మెకానిక్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు, శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి మరియు అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల సెప్టెంబర్ 18 వ తేదీ లోపుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం వెంకట్ 9912137965, కిశోర్ 9985759304 నంబర్లను సంప్రదించాలని సూచించారు. యువత ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉచిత నైపుణ్య శిక్షణ పొందడంతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలను పొందాలని సూచించారు.

## గణేష్ ఉత్సవాల్లో పర్యావరణ హితానికి పెద్దపీట

**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 13 నంది పత్రిక** పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా మట్టి, పర్యావరణహిత గణేష్ ప్రతిమలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలి, పర్యాటక, డీఆర్డీఏ, వ్యవసాయ, పాఠశాల విద్య తదితర శాఖలతో పాటు పర్యావరణ మానవ సమాజ భద్రత, బాధ్యత ఫౌండేషన్, వన్ ఎర్త్ వన్ లైఫ్ తదితర స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అధికారులతో కలిసి 2,000 పర్యావరణహిత గణేష్ ప్రతిమలతో పాటు మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలతో తయారైన ప్రతిమలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి, ఫల, పుష్ప, సీడ్స్ వంటి వాటితో తయారుచేసిన ప్రతిమలను వినియోగించడం ద్వారా పండుగను భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ హితంగా నిర్వహించవచ్చని జేసీ పేర్కొన్నారు. వినాయకుడి ఆశీస్సులతో పాటు ప్రకృతి పరిరక్షణ బాధ్యతను కూడా స్వీకరిద్దాం అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, పండుగలను ప్రకృతి హితంగా నిర్వహించేలా ప్రజలను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాస్, జిల్లా టూరిజం ఆఫీసర్ డా. కొల్లేటి రమేష్, డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, పర్యావరణ మానవ సమాజ భద్రత, బాధ్యత ప్రెసిడెంట్ శ్రీనివాస్, వన్ ఎర్త్ వన్ లైఫ్ కోఆర్డినేటర్ లీలా కుమారి గారు, డీఈవో ఎల్.చంద్రకళ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

